
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



కర్నూలు

జిల్లా వార్తలు

మంగళవారం 15 ఏప్రిల్ 2025

వ్యాపారికి అండ.. రైతుకు ఎండ..!



ప్లాట్‌ఫారాలు లేక మండిపోతున్న ఎండల మధ్య రైతులు తెచ్చిన మిర్చి బస్తాలు

కర్నూలు అగ్రికల్చర్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): మార్కెట్ యార్డులో రూ.కోట్లు ఖర్చు పెట్టి ఏర్పాటుచేసిన గోదాములను వ్యాపారులకు ధారాదత్తం చేస్తున్నారు. దీంతో రైతులు అమ్మకానికి తెచ్చిన పంట ఉత్పత్తులు మండు టెండలో మాడిపోతున్నాయి. ఎప్పుడెప్పుడు కొనుగోలు చేస్తారా అని వ్యాపారుల కోసం రైతులు ఎదురు చూడాల్సిన దుస్థితి నెలకొంది. గుంటూరు మిర్చి యార్డు తర్వాత అదేస్థాయిలో కర్నూలు మార్కెట్ యార్డుకు ఉమ్మడి జిల్లా నుంచే కాకుండా తెలంగాణ ప్రాంతం నుంచి ఎండుమిర్చిని రైతులు అమ్మకానికి తెస్తున్నారు. ప్రస్తుతం 500 క్వింటాళ్ల దాకా ఎండుమిర్చి అమ్మకానికి వస్తోంది. అయితే.. ఎర్రని ఎండలకు మిర్చి రైతులు పడుతున్న ఆగచాట్లను మార్కెట్ కమిటీ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదనే ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ఈ మార్కెట్ కమిటీకి ఛైర్‌పర్సన్‌గా కొనసాగుతున్న జాయింట్ డైరెక్టర్ రామాంజనేయులు ప్రతి నెలా సమీక్ష చేసేందుకు ఏడీఎం కార్యాలయానికి వచ్చి వెళ్తున్నారే తప్పా కూతవేటు దూరంలోని మిర్చి యార్డులో రైతులు పడుతున్న ఆవేదనను మాత్రం పట్టించుకోవడం లేదు. వివిధ ప్రాంతాల నుంచి రైతులు తెస్తున్న ఎండు మిర్చిని వెంటవెంటనే వ్యాపారుల చేత కొనుగోలు చేయించేందుకు మార్కెట్ కమిటీ అధికారులు ఏమాత్రం చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

రూ.కోట్లు ఖర్చు పెట్టి.. వ్యాపారులకు కట్టబెట్టి:

ఎండలు, వర్షాలకు రైతులు తెచ్చిన పంట ఉత్పత్తులను కాపాడేందు కోసం ప్రభుత్వం రూ.కోట్లు ఖర్చు పెట్టి ప్లాట్‌ఫారాలను ఏర్పాటు చేసింది. అయితే కర్నూలు మార్కెట్ యార్డులో ప్లాట్‌ఫారాలన్నీ వ్యాపారుల వశం చేసేశారు. ఈ యార్డులో మిర్చి వ్యాపారులకు రూ.కోట్ల విలువ చేసే ప్లాట్‌ఫారాలను వ్యాపారులకు ఉచితంగా ధారాదత్తం చేయడంపై అన్నదాతలు ఇదేమీ దారుణమంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్లాట్‌ఫారాల్లో వ్యాపారులు మిర్చిని నిల్వ చేసుకున్నందుకు వారి నుంచి ఒక్క రూపాయి కూడా మార్కెట్ కమిటీ అధికారులు వసూలు చేయడం లేదు. కొంత మంది వ్యాపారులు అక్కడే ఎలక్ట్రానిక్ కాటాలు ఏర్పాటు చేసుకొని రిటైల్‌గా వినియోగదారులకు అమ్ముకుంటున్నారు. దీని వల్ల మార్కెట్ కమిటీకి ఎటువంటి ఆదాయం లేకపోగా రైతులు అష్టకష్టాలు పడాల్సిన దుస్థితి ఏర్పడింది.

- మండుటెండలో పంట ఉత్పత్తులు
- ఉన్న ప్లాట్‌ఫారాలు వ్యాపారాలకు ధారాదత్తం
- అమ్మకాల కోసం అన్నదాతల ఎదురు చూపు
- అధికారుల తీరుపై వెల్లువెత్తుతున్న విమర్శలు

కనికరం లేని అధికారులు

దూర ప్రాంతాల నుంచి మండుతున్న ఎండలను లెక్క చేయకుండా రైతులు ఎండుమిర్చిని కర్నూలు మార్కెట్‌యార్డుకు తెస్తున్నారు. ఈ ఎండుమిర్చిని ప్లాట్‌ఫారాల్లో నిల్వ చేసి విక్రయాలు చేపట్టాల్సిన బాధ్యతను మార్కెట్ కమిటీ అధికారులు ఎప్పుడో మరిచిపోయారు. వ్యాపారుల అవసరాన్ని మాత్రమే వీరు గుర్తించి వారికి వసతులు ఏర్పాటు చేస్తున్నారే తప్పితే.. తమను ఎందుకు పట్టించుకోవడం లేదని మిర్చి రైతులు గొల్లుమంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్లాట్‌ఫారాలను రైతుల కోసం వినియోగించాల్సిన అవసరం ఉంది.

వ్యాపారులకు ప్లాట్‌ఫారాన్ని కేటాయించాం



కర్నూలు మార్కెట్ యార్డులో రైతులు తెచ్చిన పంట ఉత్పత్తులను నిల్వ చేసేందుకు అవసరమైన ప్లాట్‌ఫారాలు లేవు. దీని వల్ల ఇబ్బందులు ఉన్న మాట వాస్తవమే. మిర్చి వ్యాపారాన్ని అభివృద్ధి చేసి పన్నును పెంచేందు కోసమని మిర్చి వ్యాపారులకు ప్లాట్‌ఫారాన్ని కేటాయించాం. ఈ వ్యవహారంలో ఎటువంటి నిర్లక్ష్యం లేదు. ప్రస్తుతం మిర్చి వ్యాపారులకు వారి సొంత ఖర్చుతోనే షాపులు నిర్మించుకునేలా నిర్ణయం తీసుకున్నాం. ప్లాట్‌ఫారాల్లో మిర్చిని వ్యాపారులు నిల్వ చేసుకుని గిరాకీ వచ్చిన వెంటనే బయటకు తరలించాలని ఆదేశించాం.

- జయలక్ష్మి, సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ



రూ.కోట్లు ఖర్చు పెట్టి నిర్మించిన మిర్చి ప్లాట్‌ఫారం వ్యాపారులకు ధారాదత్తం

ఇంత దారుణం ఎక్కడా లేదు



నేను దాదాపు రూ.5 లక్షలు ఖర్చు పెట్టి రెండెకరాల్లో మిర్చి పంటను సాగు చేశా. అధిక వర్షాలు, తెగుళ్ల కారణంగా 20 బస్తాల ఎండుమిర్చి మాత్రమే చేతికందింది. కనీసం ఈ ఎండుమిర్చిని అమ్ముకుందామని గుంటూరు మార్కెట్‌కు వెళ్లకుండా శనివారం తెల్లవారుజామునే కర్నూలు మార్కెట్ యార్డుకు వచ్చాను. తెల్లవారుజాము నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మండుతున్న ఎండకు ఎప్పుడెప్పుడు కొంటారా అని వ్యాపారుల కోసం ఎదురు చూస్తూనే ఉన్నాను. టెండరు పారాలు వ్యాపారుల చేతికి మధ్యాహ్నం తర్వాతనే వస్తాయని చెబుతుండటంతో మా ప్రాణాలు పైపైనే పోతాయోనని ఆందోళనగా ఉంది.

- లింగమయ్య, ఎల్కూరు, గూడూరు మండలం

ప్లాట్‌ఫారాలను వ్యాపారులకు ఇస్తారా?



రూ.కోట్లు ఖర్చు పెట్టి ప్రభుత్వం మా పంట ఉత్పత్తులను నిల్వ చేసేందుకు గోదాములను, ప్లాట్‌ఫారాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అయితే అధికారులు, వ్యాపారుల నుంచి ఏం ప్రయోజనం పొందుతున్నారో గానీ ప్లాట్‌ఫారాలను వ్యాపారులకు ధారాదత్తం చేస్తున్నారు. కర్నూలు మార్కెట్ కమిటీలో మిర్చి ప్లాట్‌ఫారాలను వ్యాపారులకు ఉచితంగా ధారాదత్తం చేశారు. దీంతో మండుటెండలకు మాతోపాటు తెచ్చిన మిర్చి బస్తాలు ఎర్రని ఎండలకు మాడిపోవాల్సిన దుస్థితి దాపురించింది. వ్యాపారులు కోరిన వెంటనే వారికి షాపులు కేటాయిస్తున్నారు. మిర్చి బస్తాలను ప్లాట్‌ఫారాల్లో నిల్వ చేసి ఎందుకు విక్రయాలు చేపట్టడం లేదో అధికారులే సమాధానం చెప్పాలి.

- మద్దిలేటి, గూడూరు

అంబేడ్కర్ స్ఫూర్తితో ముందుకు సాగాలి

యువతకు మంత్రి టీజీ భరత్ పిలుపు



నివాళి అర్పిస్తున్న మంత్రి, ఎంపీ, కలెక్టర్, ఎస్పీ

కర్నూలు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత డా. బీఆర్ అంబేడ్కర్ మహోన్నతుడు అని, ఆయన స్ఫూర్తితో యువత ముందుకు సాగాలని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ పిలుపునిచ్చారు. జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ సాధికారత అధికారి, జాయింట్ డైరెక్టర్ రంగలక్ష్మి ఆధ్వర్యంలో సోమవారం నగరంలోని పాతబస్టాండులో భారత రత్న డా. బీఆర్ అంబేడ్కర్ జయంతి పురస్కరించుకొని ఆయన విగ్ర హానికి మంత్రి టీజీ భరత్, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, కలెక్టర్ పి. రంజిత్ బాషా, ఎస్పీ విక్రాంత్ పాటిల్, ఆర్డీవో సందీప్ కుమార్, మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు, ప్రజా ప్రతినిధులు, వివిధ కుల సంఘాల నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ రాజ్యాంగ రూపకర్త డా. బీఆర్ అంబేడ్కర్ సమాజంలో అందరికీ సమానహక్కులు కల్పించడంలో ముఖ్య పాత్ర పోషించారన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీయే కూటమి ప్రభుత్వం రాజ్యాంగంలోని విధి విధానాలను సక్రమంగా అమలు పరుస్తున్నదన్నారు. డా. బీఆర్ అంబేడ్కర్ స్ఫూర్తితో యువత ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ డా. బీఆర్ అంబేడ్కర్ ఏ ఆశయాలతో అయితే.. రాజ్యాంగ పీఠికను రాశారో.. అందులో భాగంగా తమలాంటి బడుగు బలహీనవర్గాల చెందిన వారు కూడా రాజకీయంగా చైతన్యవంతులై చట్టసభల్లో అడుగులు పెట్టి ప్రజల గొంతును అక్కడ వినిపించే అవకాశం కలిగిందన్నారు. కలెక్టర్ పి. రంజిత్ బాషా మాట్లాడుతూ డా. బీఆర్ అంబేడ్కర్ అందరికీ సమానహక్కులు కావాలని, అంటరానితనాన్ని రూపుమాపాలని పోరాడిన వ్యక్తి అని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ఎస్సీ కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మరణంలోనూ వీడని స్నేహబంధం



నుజ్జునుజ్జయిన కారు



వినోద్ (ఫైల్)



ధర్మారెడ్డి(ఫైల్)



తేజనాయుడు (ఫైల్)

- రోడ్డు ప్రమాదంలో ముగ్గురి దుర్మరణం
- మహానంది కానిస్టేబుల్‌కు తీవ్రగాయాలు
- కడప రిమ్స్‌కు తరలింపు
- యువకుల కుటుంబాల్లో తీరని విషాదం
- కన్నీరుమున్నీరైన బంధువులు
- కడప జిల్లా ఒంటిమిట్ట వద్ద ఘటన

నంద్యాల, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): ఒకరి వైద్య చికిత్సల కోసం వెళ్లిన ఆ నలుగురు స్నేహితులు.. సహాయం చేసేందుకు వెళ్లిన వారిని మృత్యువు రోడ్డు ప్రమాదం రూపంలో కబళించింది. ఈప్రమాదంలో ముగ్గురు మిత్రులు మృతిచెందారు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. వీరంతా నంద్యాల జిల్లా వాసులే. ఈఘటన కడప జిల్లా ఒంటిమిట్ట మండలం నడింపల్లి వద్ద సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. నంద్యాలలోని హౌసింగ్‌బోర్డు కాలనీకి చెందిన తేజనాయుడు(21) పట్టణంలో ఐటీఐ విద్యను అభ్యసిస్తున్నాడు. ఇదేకాలనీకి చెందిన సమీప బంధువు సునీల్‌నాయుడు 2011లో కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాడు. ప్రస్తుతం ఇతను మహానంది పోలీసుస్టేషన్‌లో రెండేళ్లుగా కోర్టు కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. అయితే వీరిద్దరికి స్వయాన బాబాయి అయిన హరినాయుడు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో వీరిద్దరూ కలిసి హరినాయుడికి వైద్యచికిత్సల నిమిత్తం తిరుపతిలోని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లాలని భావించారు.

తన స్నేహితులతో కలిసి..

కానిస్టేబుల్ సునీల్‌నాయుడు ఈనెల 13న తన విధులకు సెలవు పెట్టాడు. ఆ తర్వాత తన స్నేహితులైన చాగలమర్రి మండలం కొత్తపల్లికి చెందిన బత్తూరు ధర్మారెడ్డి(27), బండి ఆత్మకూరు మండలం సోమరాజులపల్లికి చెందిన వినోద్ (29) (వీరిద్దరూ నంద్యాలలోని ఓ ప్రైవేట్ కంపెనీలో) ఉద్యోగం చేస్తున్నారు. తన చిన్నాన్న ఆరోగ్య విషయం సునీల్ వారితో చర్చించాడు. ఆ తర్వాత ఈ నలుగురు కలిసి హరినాయుడిని తీసుకొని ఈ నెల 13న కారులో నంద్యాల నుంచి తిరుపతికి వెళ్లి అతడిని అక్కడ ఆస్పత్రిలో చేర్పించారు.

తిరుగు ప్రయాణంలో ప్రమాదం..

హరినాయుడిని అక్కడ వదిలి.. వీరందరూ అదే వాహనంలో సోమవారం నంద్యాలకు బయలుదేరారు. కడప జిల్లాలోని ఒంటిమిట్ట మండలం నడింపల్లి వద్దకు రాగానే.. ఎదురుగా వస్తున్న.. పోలీసు పెట్రోలింగ్ వాహనంతో పాటు కడప- తిరుపతి బస్సును కూడా ఢీకొట్టడంతో వీరు ప్రయాణిస్తున్న స్కార్పియో నుజ్జునుజ్జైంది. దీంతో అక్కడికక్కడ తేజనాయుడు, వినోద్, బత్తూరు ధర్మారెడ్డి మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన కానిస్టేబుల్ సునీల్‌నాయుడిని వైద్య చికిత్సల నిమిత్తం కడప రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. అయితే కానిస్టేబుల్ పరిస్థితి కూడా విషమంగా ఉందని సమాచారం.

ఆ కుటుంబాల్లో విషాదం

ఈ ప్రమాదంలో మృతిచెందిన ముగ్గురితో పాటు గాయపడిన కానిస్టేబుల్ సైతం అందరూ స్నేహితులే కావడంతో ఆయా కుటుంబాల్లో తీరని విషాదం నింపింది. మృతి చెందిన వారికి ఏ కుటుంబాన్ని కదలించిన కన్నీరుమున్నీరవుతున్నారు. ఐటీఐ చదువుతున్న తేజనాయుడు తమ చిన్నాన్న ఆరోగ్యం కోసం వెళ్లి ఇలా రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో తల్లిదండ్రులు భద్ర, రాజేశ్వరి బోరమని విలపించారు. ఒక్క కుమారుడు దూరం కావడంతో వారు బాధ వర్ణణాతీతం. బత్తూరి ధర్మారెడ్డి మృతి విషయం తెలియగానే.. బాధిత తల్లిదండ్రులు బత్తూరు శివ శంకర్‌రెడ్డి, అరుణమ్మ హుటాహుటిన కడప కు బయలుదేరారు. ధర్మారెడ్డి మృతితో గ్రామంలో విషాద చాయలు అలముకు న్నాయి. మృతుల్లో మరొకరైన వినోద్ చిన్నతనం నుంచే.. తాత అవ్వలు, మేనమామల) వద్ద ఉంటూ చదువు కున్నాడు. ప్రస్తుతం జియో కంపెనీ లో పనిచేస్తున్నాడు. ఈ రోడ్డు ప్రమాదంలో వినోద్ మృతి చెందా డ నే విషయం తెలియగానే.. ఇంటి వద్ద అవ్వ, తాతలతో పాటు బంధు వుల రోదనలు మిన్నంటాయి. ఇదే ఘటనలో కానిస్టేబుల్ సునీల్‌నాయుడు తీవ్ర గాయపడి ప్రాణాలతో బయట పడ టంతో బాధిత కుటుంబ ఊపిరి పీల్చుకున్నట్లైంది.

స్వర్ణ రథంపై ప్రహ్లాదరాయలు



స్వర్ణ రథంపై విహరిస్తున్న ప్రహ్లాదరాయలు

మంత్రాలయం, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్రస్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు స్వర్ణ రథంపై విహరించారు. సోమవారం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆధ్వర్యంలో బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బృందావనానికి క్షీరాభిషేకం, విశేష పంచామృతాభిషేకం చేసి వెండి, బంగారు, పట్టు వస్త్రాలతో శోభాయ మానంగా అలంకరించారు. మూలరాములు , జయరాములు, దిగ్విజయ రాములకు బంగారు నాణేలతో అభిషేకం చేశారు. వేద పండితుల మంత్రోచ్ఛరణాలు, మంగళ వాయిద్యాల మధ్య స్వర్ణ రథంపై ప్రహ్లాదరాయలను అధిష్టించి ఆలయ ప్రాంగణం చుట్టూ ఊరేగించారు. అనంతరం ఊంజలసేవ నిర్వహించారు. భక్తులు గ్రామ దేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్రస్వామికి విశేష పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. మఠం పీఠాధిపతి భక్తులకు ఫల, పుష్ప, మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వదించారు.

మంత్రాలయంలో పోటెత్తిన భక్తులు

రాఘవేంద్ర స్వామి దర్శనార్థం వచ్చిన భక్తులతో మంత్రాలయం సందడిగా మారింది. శని, ఆది, సోమవారం సెలవుదినాలు కావటంతో వేలాది మంది భక్తులు తరలి వచ్చారు. దీంతో మఠం ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది. అన్నపూర్ణ భోజన శాల, మహాముఖద్వారం, మధ్వమార్గ్ కారిడార్, ప్రధాన రహదారులు, రాఘవేంద్ర సర్కిల్, తుంగభద్ర నదీతీరం భక్తులతో కోలాహలంగా మారిం ది. తుంగభద్ర నదిలో పుణ్యస్నానాలు ఆచరించి గ్రామదేవత మంచాల మ్మను దర్శించుకొని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.



శ్రీ మఠం ప్రాంగణంలో కిక్కిరిసిన భక్తులు

నేడు భ్రామరికి కుంభోత్సవం



కుంభోత్సవానికి ముస్తాబైన అమ్మవారి ఆలయం

శ్రీశైలం, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం మహాక్షేత్రంలో మంగళవారం భ్రమరాంబికాదేవి అమ్మవారికి వార్షిక కుంభోత్సవం కార్యక్రమాన్ని దేవస్థానం ఘనంగా నిర్వహించనుంది. కుంభోత్సవానికి ఏర్పాట్లను దేవస్థానం ఇప్పటికే పూర్తి చేసింది. అమ్మవారికి ఉత్సవ సంబంధ కార్యక్ర మాలు సంపూర్ణంగా జరిపించాలని ఆలయ ఈవో ఎం. శ్రీనివాసరావు అర్చకులకు, అధికారులకు సూచనలిచ్చారు. కుంభోత్సవం వేడుక అనంతరం అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుంటారని క్యూలైన్లలో తొక్కిసలాట జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని దేవస్థానం భద్రత విభాగపు పర్యవేక్షకులను ఆదేశించారు. మంగళవారం జరుగనున్న కుంభోత్సవం సందర్భంగా శ్రీశైలం సీఐ జి. ప్రసాదరావు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.

ఆది దంపతులకు వెండి రథోత్సవం: శ్రీశైల క్షేత్రంలో సోమవారాన్ని పురస్కరించుకొని భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లకు సాయంత్రం సహస్ర దీపాలంకరణ సేవను దేవస్థానం ఘనంగా నిర్వహించింది. అనంతరం సహస్ర దీపాలంకరణ సేవను నిర్వహించారు.

శ్రీరాముని జీవితం స్ఫూర్తిదాయకం

పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్


ప్రసంగిస్తున్న మంత్రి టీజీ భరత్

కర్నూలు కల్చరల్, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): శ్రీరాముని జీవితం వర్తమాన సమాజానికి ఎంతో స్ఫూర్తిదాయకమని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. సోమవారం నగరంలోని మామిదాలపాడు సమీపంలోగల శ్రీ గోదారంగనాథస్వామి దేవస్థానం (గోదాగోకుల క్షేత్రం)లో ఐదు రోజులపాటు కొనసాగే శ్రీరామాయణ మహాయజ్ఞం, రామాయణ పారాయణం కార్యక్రమాలను వైభవంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మంత్రి టీజీ భరత్ మహాయజ్ఞ కార్యక్రమాన్ని పలువురు జీయర్ స్వాముల ఆధ్వర్యంలో ప్రారంభించారు.

● శ్రీమద్రామాయణం ధార్మిక జీవన మార్గదర్శిని
- త్రిదండి అష్టాక్షరీ సంపత్కుమార రామానుజ జీయర్ స్వామీజీ

యుగయుగాలుగా, తరతరాలుగా మానవులందరికీ ఆదర్శవంతమైన జీవన మార్గాన్ని ప్రబోధించే అద్భుత కావ్యం శ్రీమద్రామాయణమని త్రిదండి అష్టాక్షరీ సంపత్కుమార రామానుజ జీయర్ స్వామీజీ ఉద్బోధించారు. ఈ కార్యక్రమంలో రామాణయంలోని వివిధ అంశాలపై పలువురు పండితులు ప్రసంగించారు. గోదాగోకులం వ్యవస్థాపక అధ్యక్షుడు మారం నాగరాజ గుప్త, మేనేజింగ్ ట్రస్టీ పల్లెర్ల నాగరాజు, వికాస తరంగిణి కేంద్ర సమితి అధ్యక్షుడు తటి. రమేష్ గుప్త తదితరులు పాల్గొన్నారు.

గాలి వాన బీభత్సం

● నేలరాలిన అరటి, మామిడి కాయలు


భారీ వర్షానికి నేలవాలిన అరటి చెట్లు

ఓర్వకల్లు, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): గాలీవాన బీభత్సానికి అరటి చెట్లు నేలపాలు కాగా, మామిడికాయలు నేల రాలాయి. సోమవారం సాయంత్రం గాలీవాన బీభత్సంతో రైతులకు తీవ్ర నష్టం సంభవించింది. ప్రతి ఏటా ఇదే నెలలో అకాల వర్షాలతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ ఏడాది కూడా చేతికొచ్చినటు అరటి, మామిడి పంట నేలపాలు కావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని కాల్వ, హుశేనాపురం, కాల్వబుగ్గ గ్రామాల రైతులు తీవ్రంగా నష్టపోయారు. అయితే.. కాల్వ గ్రామంలో విద్యుత్ స్థంభం నేలకొరగడంతో విద్యుత్ లేక ప్రజలు దోమల బెడదతో అల్లాడిపోయారు. మామిడి, అరటి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

ఇంటర్‌లో కేజీబీవీ విద్యార్థినుల చరిత్ర: కలెక్టర్

కర్నూలు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): ఇంటర్ పబ్లిక్ పరీక్షల్లో రాష్ట్ర స్థాయిలో కర్నూలు జిల్లా కేజీబీవీ విద్యార్థినులు ప్రతిభ కనబరిచి చరిత్ర సృష్టించడం గర్వకారణమని కలెక్టర్ పి.రంజిత్ బాషా పేర్కొన్నారు. సోమవారం మూడు కేజీబీవీల విద్యార్థినులు తమ అద్భుత విజయాలను సంతోషంగా జరుపుకునేందుకు కలెక్టర్‌ను కలిసి అభినందనలు పొందారు. విద్యార్థినులను కలెక్టర్ ఘనంగా సన్మానించి వారి కృషిని, పట్టుదలను విద్యాప్రతిభను ప్రశంసించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచలింగాల కేజీబీవీకి చెందిన మానస 992/1000మార్కులు, గూడూరు కేజీబీవీకి చెందిన సునీత 983/1000 మార్కులు, ఓర్వకల్లు కేజీబీవీ చెందిన హరిత 913 మార్కులు సాధించారన్నారు. ఈ ఫలితాలు వారి విద్యాశక్తిని నిదర్శనమని పేర్కొన్నారు. పేదరికం ప్రతిభకు అడ్డుకాదని పేర్కొంటూ ప్రతిభావంతులైన ఈ విద్యార్థినులకు జిల్లా పరిపాలన సంపూర్ణ సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు. ఈ విద్యార్థినులకు ఈ నెల 15వ తేదీన విజయవాడలో ఆంధ్రప్రదేశ్ మానవ వనరుల అభివృద్ధిశాఖ మంత్రివర్యుల చేతుల మీదుగా ప్రతిష్టాత్మకమైన సన్ షైన్ స్టార్స్ అవార్డులు అందుకోబోతున్నారని తెలిపారు.

ఎక్సైజ్ అసోసియేషన్‌కు ఇద్దరు ఎంపిక

కర్నూలు అర్బన్, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రొహిబిషన్ ఎక్సైజ్ కానిస్టేబుల్స్ అండ్ హెడ్‌కానిస్టేబుల్స్ అసోసియేషన్‌కు ఉమ్మడి జిల్లా నుంచి ఇద్దరు ఉద్యోగులు ఎంపికయ్యారు. విజయవాడలో నిర్వహించిన ఎన్నికల్లో రాష్ట్ర అధ్యక్షుడిగా కోటయ్యపై 195 ఓట్లతో శ్రీకాకుళానికి చెందిన జీవీ రమణరావు ఎన్నికయ్యారు. ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి జాయింట్ సెక్రటరీగా పి. జగదీష్, ప్రెస్ సెక్రటరీగా డి. దస్తగిరిని ఎనుకున్నామని ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గిరి తెలిపారు.

సభ్యత్వ నమోదుపై వివాదం

కర్నూలు క్రైం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో డీమార్టు వెనుక వైపు ఉన్న రాఘవేంద్రనగర్ కాలనీలో టీడీపీ సభ్యత్వ నమోదుపై వివాదం నెలకొంది. తమవార్డులో టీడీపీ సభ్యత్వ నమోదు ఎలాచేస్తారంటూ వైసీపీ కార్యకర్తలు టీడీపీ కార్యకర్త శేఖర్‌గౌడుపై దాడిచేసిన ఘటన కలకలం రేపింది. కొద్ది కాలంగా శేఖర్‌గౌడు 34వ వార్డులో టీడీపీ సభ్యత్వ నమోదు చేయిస్తున్నారు. ఈ నేపథ్యంలో వైసీపీ కార్పొరేటర్ అనుచరులు ప్రభాకర్ నాయుడు, రహమతుల్లా, కాశీ, పఠాన్‌లు శేఖర్‌గౌడుపైన దాడిచేశారు. శేఖర్‌గౌడు స్థానికంగా టీడీపీ కార్యాలయంలో ఉండగా.. అక్కడకు చేరుకొని ఆయనపై దాడిచేసి గాయపరిచారు. కార్పొరేటర్ అనుమతుల్లేకుండా నీవెలా టీడీపీ సభ్యత్వ నమోదు చేస్తావంటూ దాడికి దిగారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు కార్యాలయం వద్దకు చేరుకున్నారు. వైసీపీ కార్యకర్తలను అరెస్టు చేయాలంటూ డిమాండ్ చేశారు. బాధితుని ఫిర్యాదు మేరకు వైసీపీ కార్యకర్తలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మధుసూదన్‌గౌడు తెలిపారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

కోడుమూరు రూరల్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనుగొండ హంద్రీనదిలో విద్యుత్ సర్వీస్ వైర్ తగిలి ఎద్దు మృతిచెందింది. బాధిత రైతు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన రైతు చంద్ర ఎద్దుల బండితో హంద్రీనది అవతల పొలానికి వెళ్లాడు. పని అనంతరం మధ్యాహ్నం ఇంటికి బయలుదేరాడు. మార్గమధ్యలో హంద్రీనదిలో ఎద్దులను శుభ్రం చేయడానికి బండి మళ్లించాడు. ఈ సమయంలో ఇసుకపై ఉన్న విద్యుత్ సర్వీసు వైరు ఓఎద్దు కాలికి తగిలి షాక్‌కు గురైంది. దీంతో ఎద్దు ఒక్కసారిగా ఇసుకపై పడిపోయింది. వెంటనే అప్రమత్తమైన రైతు మరో ఎద్దును బండి నుంచి విడదీసి దూరంగా తీసుకెళ్లాడు. కళ్లెదుటే సుమారు రూ.80 వేలు విలువ చేసే ఎద్దు మృతి చెందడంతో కన్నీటి పర్యంతమయ్యాడు. హంద్రీనదిలో పలుచోట్ల విద్యుత్ సర్వీసు వైర్లు ఇసుకపైనే ఉన్నాయని, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

అంబేద్కర్‌కు ఘన నివాళి

ఓర్వకల్లు, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): అంబేద్కర్ జయంతి సందర్భంగా ఓర్వకల్లు ఎస్సీ బాలికల వసతి గృహంలో నూతనంగా నిర్మించిన అంబే ద్కర్ విగ్రహాన్ని ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, టీటీడీ బోర్డు సభ్యుడు మల్లెల రాజశేఖర్ ఆవిష్కరించి నివాళులర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అంబేద్కర్‌ను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. సోమవారం అనంతరం సచి వాలయం సమీపాన నూతనంగా నిర్మించిన పశువుల నీటి తొట్టిని ప్రారంభించారు. అలాగే బస్టాండు సమీపంలో దళిత సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ జయంతి వేడుకల్లో పాల్గొని ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఎంపీడీవో శ్రీనివాసులు, ఈవోఆర్‌డీ సుబ్బరాయుడు, ఎస్‌ఐ సునీల్ కుమార్, వార్డెన్లు ప్రమీలారాణి, సుంకన్న, టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి, ఉపాధ్యక్షులు మోహన్ రెడ్డి, నాయకులు రాంభూపాల్ రెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, భాస్కర్ రెడ్డి, మహబూబ్ బాషా, ఏసేపు పాల్గొన్నారు.

● మండలంలోని హుశేనాపురంలో అంబేద్కర్ చిత్రపటానికి సర్పంచ్ గోవర్ధనమ్మ, పాలకొలనులో సర్పంచ్ చదువుల సుజాతమ్మ, చింతలపల్లెలో సర్పంచ్ వెంకటరమణ, అంబేద్కర్ జయంతిని నిర్వహించారు.

కర్నూలు అర్బన్: జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ ధరూర్ జేమ్స్ ఆధ్వర్యంలో అంబేద్కర్ చిత్రపటానికి కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, టీడీపీ యువనేత కేఈ సత్యం, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకెపోగు ప్రభాకర్, నగర అధ్యక్షులు నాగరాజు యాదవ్, నాయీ బ్రహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పాలక వీటి విజయ కుమార్, పేరపోగు రాజు, సత్రం రామక్రిష్ణ, హనుమంతరావుచౌదరి, వేంపెంట రాంబాబు నివాళి అర్పించారు.

● జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో అంబేద్కర్ విగ్రహానికి సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు షేక్ జీలాని, మాజీ ఎమ్మెల్సీ సుధాకర్ బాబు, ఓబీసీ జిల్లా చైర్మన్ డీవీ సాంబశివుడు, ప్రమీల, షేక్ ఖాజా హుస్సేన్, రాజేంద్రప్రసాద్ పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

● రాయలసీమ యూనివర్సిటీలోని పాత లైబ్రరీ భవనం వద్ద ఉపకులపతి వెంకట బసవరావు అంబేద్కర్‌కు నివాళి అర్పించారు. వర్సిటీ ముఖ ద్వారం ఎదుట 10 అడుగుల అంబేద్కర్ విగ్రహానికి రిజిస్ట్రార్ బోయ విజయకుమార్ నాయుడుతో కలిసి భూమిపూజ చేశారు. క్లస్టర్ వరిసటీ రిజిస్ట్రార్ కట్టా వెంకటేశ్వర్లు, డీన్‌లు పాల్గొన్నారు.

● క్లస్టర్ యూనివర్సిటీలో ఇన్‌చార్జి ఉపకులపతి వెంకట బస వరావు ఆధ్వర్యంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. రిజిస్ట్రార్ కట్టా వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ ఇంది రాశాంతి, వైస్ ప్రిన్సిపల్ దేవికారాణి పాల్గొన్నారు.

● రాయలసీమ యూనివర్సిటీలో అంబేద్కర్ విగ్రహానికి ఎస్‌ఎఫ్‌ఐ వర్సిటీ కన్వీనర్ రామక్రిష్ణ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో రాజు, గణేష్, బాలాజీ, వేణు, కళ్యాణ్, అమర్, ప్రశాంత్, గోపాల్ పాల్గొన్నారు.

● బిర్లా కాంపౌడ్‌లోని విద్యా అకాడమీ సెంటర్‌లో బీసీ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్ బాబు ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి వేడుకలు నిర్వహించారు. విద్యార్థి జేఏసీ చైర్మన్ కోనేటి వెంకటేశ్వర్లు, వెంకటేశ్వరమ్మ, ఎస్‌చంద్ర మోహన్ పాల్గొన్నారు.

కర్నూలు అగ్రికల్చర్: కర్నూలు మార్కెట్ కమిటీ కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి కర్నూలు మార్కెట్ కమిటీ సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ జయలక్ష్మి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అసిస్టెంట్ సెక్రటరీ వెంకటేశ్, సెక్రటరీలు కేశవరెడ్డి, నాగేష్, శివన్న, సెక్యూరిటీ గార్డుల సంక్షేమ సంఘం ప్రతినిధులు కిరణ్, మద్దిలేటి పాల్గొన్నారు.

● బంగారుపేటలోని జిల్లా మత్స్యకార కార్యాలయంలో ఆ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రామనాథరావు, సహకార యూనియన్ జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్ అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించారు.

కర్నూలు స్పోర్ట్స్: జైభీమ్ జనశక్తి ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి వేడుకలు నిర్వహించారు.

కర్నూలు కలెక్టరేట్: నగరంలోని క్లస్టర్ యూనివర్సిటీ ప్రాంగణంలో అంబేద్కర్ విగ్రహానికి టీఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రాగిరి చంద్రప్ప, అంబేద్కర్ స్టూడెంట్ అసోసియేసన్ కన్వీనర్ రాఘవేంద్ర, భీమ్ ఆర్మీ కన్వీనర్ విజయభాస్కర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● బిర్లా కాంపౌండులో వాల్మీకి బోయ సేవా సంస్థ ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. వాల్మీకి సంఘాల నాయకులు కుబేరస్వామి, బేతం కృష్ణుడు, కొళ్లాయి పెద్దయ్య, బస్తిపాడు మల్లికార్జున పాల్గొన్నారు.

● పాతబస్టాండులో అంబేద్కర్ విగ్రహానికి విద్యార్థి సమైఖ్య జిల్లా కార్యదర్శి మమేష్ పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కర్నూలు కల్చరల్: వీహెచ్‌పీ - సామాజిక సమరసత విభాగం ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. పాత బస్టాండులోని అంబేద్కర్ విగ్రహానికి పూలదండలు వేసి నివాళులు అర్పించారు. వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు టీసీ మద్దిలేటి, ఉపాధ్యక్షులు డాక్టర్ ఎల్ అమరసింహారెడ్డి, గోవిందరాజులు పాల్గొన్నారు.

● జిల్లా కేంద్ర గ్రంథాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కె. ప్రకాశ్ పూలమాలలు వేసి నివా ళి అర్పించారు. గ్రంథాలయ సంస్థ డిప్యూటీ లైబ్రేరియన్ వి. పెద్దక్క, గ్రంథాలయ ఉద్యోగులు, పాఠకులు పాల్గొన్నారు.

కర్నూలు క్రైం: స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం అంబేద్కర్ జయంతి వేడుకలు నిర్వహించారు. అడిషినల్ ఎస్పీలు హుశేన్‌పీరా, కృష్ణమోహన్‌లు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆర్‌ఐలు జావేద్, సోమశేఖర్ నాయక్, నారాయణ, ఆర్‌ఎస్‌ఐలు, ఏఆర్ స్పెషల్ పార్టీ పోలీసులు పాల్గొన్నారు.

కర్నూలు ఎడ్యుకేషన్: రాజ్‌విహార్ సమీపంలోని అంబేద్కర్ భవనంలో అంబేద్కర్ విగ్రహానికి డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గట్టు తిమ్మప్ప, రత్నం ఏసేపు, లక్ష్మీనారాయణ నివాళి అర్పించారు.

● బి.క్యాంపు ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో అంబేడ్కర్ జయంతి వేడుకలు ఆర్‌ఐవో గురువయ్య శెట్టి, ప్రిన్సిపాల్ నాగస్వామి నాయక్ ఆధ్వర్యంలో జరిగాయి. గ్రామీణ సేవ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ డైరెక్టర్ పుష్పకుమార్, నైస్ కంప్యూటర్ ప్రతినిధి రాయపాటి శ్రీనివాస్‌రావు, మీసీ వెల్ఫేర్ ఆఫీసర్ బెన్నమ్మ, అధ్యాపకులు పాల్గొన్నారు.

● శ్రీమాత మారెమ్మ గుడి దగ్గర ఉన్న అంబేద్కర్ విగ్రహానికి బీజేపీ సీనియర్ నాయకుడు నాగరాజు యాదవ్ నివాళి అర్పించారు.

● పాతనగరంలోని అంబేద్కర్ విగ్రహానికి పీఆర్‌టీయూ జిలా అధ్యక్షుడు ఎన్‌వీ కృష్ణారెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడు రమణయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

● ఎస్టీయూ, యూటీఎఫ్, కర్నూలు జిల్లా కురువ సంఘం, మాల విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమములో ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్. గోకారి, ప్రధాన కార్యదర్శి టి.కే.జనార్ధన్, కురువ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కె.రంగస్వామి, ఉపాధ్యక్షులు ధనుంజయ్య, కోశాధికారి కే.సి నాగన్న, జిల్లా మహిళా సంఘం అధ్యక్షురాలు టీ.శ్రీలీల, మాల విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు కాసారపు వెంకటేష్, యూటీఎఫ్ సంఘం జిల్లా అధ్యక్షులు రవికుమార్, ప్రధాన కార్యదర్శి నవీన్ పాటిల్ పాల్గొన్నారు.

● స్థానిక ప్రభుత్వ టౌన్ మోడల్ జూనియర్ కళాశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహాన్ని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు ఆవిష్కరించారు. కార్యక్రమములో మాజీ ఎమ్మెల్సీ సుధాకర్ బాబు, ఏపీ ఎస్సీ వెల్ఫేర్ అసోసియేన్ కర్నూలు ప్రెసిడెంట్ వెంకటేశ్వర్లు, కమిషనర్ రవీంద్ర బాబు, డీవీఈఓ పరమేశ్వర రెడ్డి, ఆర్‌ఐవో గురువయ్య శెట్టి పాల్గొన్నారు.

● రాజ్‌విహార్‌లోని అంబేద్కర్ భవనంలో బీసీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ధనుంజయ్య ఆచారి అధ్యక్షతన అంబేద్కర్ జయంతి వేడుకలు జరిగాయి. కార్యక్రమములో హోటల్ వర్కస్ యూనియన్ నాయకులు పురుషోత్తం, అయ్యన్న యాదవ్, అంజి, ప్రదీప్, నాగేంద్ర పాల్గొన్నారు.

● బి.క్యాంపు ఎస్సీ ప్రభుత్వ బాలికల వసతి గృహంలో అంబేద్కర్ జయంతిని హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ బెన్నెమ్మ అధ్యక్షతన నిర్వహించారు.

● ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జి.హృదయరాజు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఇస్మాయిల్, మరియానందం, యోగేంద్రబాబు, శేషాచలం, భగవాన్, రామగోపాల్ రెడ్డి, శేషసేనా రెడ్డి, మల్లికార్జున పాల్గొన్నారు.

కర్నూలు న్యూసిటీ: జిల్లా పరిషత్ మినీ సమావేశ భవనంలో సీఈఓ జి.నాసరరెడ్డి అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పరిపాలన అధికారులు మురళీ మోహన్‌రెడ్డి, జితేంద్ర, బసవశేఖర్, నాగేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

● కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్ రవీంద్రబాబు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మేనేజర్ చిన్నరాముడు, ప్రజారోగ్య అధికారి కె.విశ్వేశ్వరరెడ్డి, ఆర్‌ఓ జునైద్ పాల్గొన్నారు.

● సేవ్ వక్ఫ్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో పాతబస్టాండులో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివా ళులర్పించారు. కార్యక్రమంలో జమాతే ఇస్లామి ఏ హింద్ జిల్లా నాయకులు మునీర్ అహ్మద్, ఇస్మాయిల్, మాలమహానాడు రాయ లసీమ అధ్యక్షుడు కేదార్‌నాథ్, ఆవాజ్ కమిటి నాయకులు పి.ఇక్బాల్ హుస్సేన్ పాల్గొన్నారు.

● నగర మేయర్ బీవై.రామయ్య క్యాంపు కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి వైసీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● మాజీ ఎమ్మెల్యే, వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి పాతబస్టాండులో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

● అంబేద్కర్ జయంతిని సేవ్ కాన్స్టిట్యూషన్ డేగా జరుపుకో వాలని ఆల్ ఇండియా సెంటర్ నిర్ణయించినట్లు బీఎస్‌ఎన్‌ఎల్ ఎంప్లా యీస్ యూనియన్ జిల్లా కార్యదర్శి రామరాజు అన్నారు. యూని యన్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆర్గనైజింగ్ సెక్రటరీ జీవీ భాస్కర్‌రెడ్డి, బీవీ రమణ, చక్రపాణి, ప్రసాద్ పాల్గొన్నారు.

● కులవివక్ష పోరాట సమితి ఓల్డ్‌సిటీ, ఐద్వా, శ్రామిక మహిళా సంఘం, సీఆర్ భవన్‌లో ఏఐవైఎఫ్, డీహెచ్‌పీఎస్, ప్రజాపరిరక్షణ సమితి ఆధ్వర్యంలో, గిరిప్రసాద్ నగర్‌లో అంబేద్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆవాజ్ కమిటీ రాష్ట్ర నాయకుడు గౌస్ దేశాయ్, కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఆనంద్‌బాబు, ఐద్వా రాష్ట్ర నాయకురాలు పి.నిర్మల, బి.పద్మ, విజయలక్ష్మి, వేనమ్మ, సావిత్రి, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మునెప్ప, ఏఐవైఎఫ్, డీహెచ్‌పీఎస్ నాయకులు మహేష్, శ్రీనివాసులు, బీసన్న, రామచంద్రులు, ప్రజాపరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కే.బలరాం, పద్మానందయోగి, డేవిడ్, రవికుమార్, మురళి పాల్గొన్నారు.

కర్నూలు(రూరల్): కర్నూలు రూరల్ మండలం దిన్నెదేవరపాడు పరిధిలోని విజ్ఞాన పీఠం అరక్షిత బాలుర పాఠశాలలో విజ్ఞాన సేవా సమితి ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. విజ్ఞాన సేవ సమితి ప్రతినిధులు రామిరెడ్డి, రమణారెడ్డి, మద్దిలేటి, వి. సుంకన్న, రమణయ్య, రణధీర్‌రెడ్డి, రమేష్ పాల్గొన్నారు.

● పంచలింగాలలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎమ్మార్పీఎస్ నాయకులు ముప్పసాని సుధాకర్, సిద్దయ్య, నేహమియా, సురేష్ బాబు, రాజేశ్, రాజు, మహేష్, న్యాయవాది బాబు పాల్గొన్నారు.

● నగరంలోని లేబర్‌కాలనీలో వెలుగు ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతిని నిర్వహించారు. కర్నూలు రూరల్ మండల తహసీల్దారు టీవీ రమేష్ బాబు హాజరై అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. రామపోగు రామకృష్ణ, వీరాం జి, జమ్మన్న, రాము, పవన్ పాల్గొన్నారు.


ఓర్వకల్లులో అంబేద్కర్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే గౌరు చరిత, టీటీడీ బోర్డు సభ్యుడు మల్లెల రాజశేఖర్



కోడుమూరులో నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే దస్తగిరి, కర్నూలులో నివాళి అర్పిస్తున్న పీఆర్‌టీయూ నాయకులు


కార్పొరేషన్ కార్యాలయంలో..


టీడీపీ కార్యాలయంలో..


కాంగ్రెస్ కార్యాలయంలో..

కర్నూలు హస్పిటల్: అంబేద్కర్ గొప్ప దార్శనికుడు అని ఏపీ గవర్నమెంటు డాక్టర్ల అసోసియేషన్ అధ్యక్షుడు ఫోరెన్సిక్ మెడిసిన్ డాక్టర్ బ్రహ్మాజీ మాస్టర్ అన్నారు. కర్నూలు మెడికల్ కాలేజీలో ఏపీజీడీఏ ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. డాక్టర్లు నాగేశ్వరరావు, రామశివనాయక్, శ్రీరాములు, సాయిసుధీర్ పాల్గొన్నారు.

● అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగం వల్లె దేశంలో బడుగు, బలహీనవర్గాల దళితులు అనేక ప్రయోజనాలు పొందుతున్నారని సీనియర్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ బి.శంకర్‌శర్మ అన్నారు. నగరంలోని గాయత్రీ ఎస్టేట్‌లోని గురుదత్త పాలిక్లీనిక్‌లో ఆయన నిరుపేద మహిళలకు ఉచితంగా చీరలను పంపిణీ చేశారు.

● వైద్యఆరోగ్య శాఖ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి వేడుకలు నిర్వహించారు. సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కుమారస్వామి, ఎన్.ప్రకాష్‌రాజ్, చిన్నరాముడు, ఏసేపు, కరుణానిధి పాల్గొన్నారు.

కోడుమూరు: కోడుమూరు పట్టణంలో అంబేద్కర్ జయంతి వేడుకలు మాలమహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శి మునుస్వామి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కోడుమూరు ఎమ్మెల్యే దస్తగిరి హాజరయ్యారు. కొత్త బస్టాండ్ సమీపంలోని అంబేద్కర్ విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బడేసా, గౌడ్, గోపాల్ నాయుడు, బలరాం పాల్గొన్నారు. అలాగే వైసీపీ నాయకులు అంబేద్కర్ విగ్రహానికి నివాళి అర్పించారు. జడ్పీటీసీ రఘునాథ్‌రెడ్డి, నాయకులు రమేష్ నాయుడు, కృష్ణారెడ్డి పాల్గొన్నారు. అలాగే ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి సర్పంచ్ భాగ్యరత్న పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఎమ్మార్పీఎస్ నాయకుడు ఆంద్రయ పాల్గొన్నారు. అలాగే పాలకుర్తిలో అంబేద్కర్ విగ్రహానికి టీడీపీ సీనియర్ నాయకుడు చంద్రమౌళి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వర్లు, యూసుప్, షేక్షావలి, సుంకన్న పాల్గొన్నారు.

సి.బెళగల్: మండల కేంద్రమైన సి.బెళగల్‌లో అంబేద్కర్ విగ్రహానికి టీడీపీ నాయకుడు భీమన్న, ఎస్‌ఐ తిమ్మారెడ్డి, తహ సీల్దార్ పురుషోత్తం పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనం తరం కేక్ కట్ చేసి సంబరాలు చేశారు. అలాగే తహసీల్దార్, ఎంపీడీవో, గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో అంబేద్కర్ జయంతి వేడుకలు జరుపుకున్నారు. అలాగే మండలంలోని పోలకల్లు, కొండాపురం, బురాన్‌దొడ్డి గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ నాయకులు అంబే ద్కర్ జయంతిని నిర్వహించారు. మాజీ ఎంపీటీసీ ధనుంజయుడు, మాజీ జడ్పీటీసీ చంద్రశేఖర్, వలి పాల్గొన్నారు.

గూడూరు: గూడూరు మండలం కె.నాగలాపురం గ్రామంలో అంబేద్కర్ ఆశయ సాధన కమిటీ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి మండల టీడీపీ అధ్యక్షుడు జె సురేష్ పూలమాలలు వేసి నివా ళులర్పించారు. సభ్యులు ఆంజనేయులు, సురేష్, సురేంద్ర, దిలీప్, అనిల్, సుధీర్ పాల్గొన్నారు.


అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు


పేదలకు చీరలు పంపిణీ చేస్తున్న డాక్టర్ శంకర్‌శర్మ

డాక్టర్ ఇస్మాయిల్ సేవలు చిరస్మరణీయం


నివాళి అర్పిస్తున్న టీజీ వెంకటేశ్

కర్నూలు స్పోర్ట్స్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): పేదల డాక్టరుగా ప్రజలకు సేవలందించిన డా.ఇస్మాయిల్ అందించిన సేవలు చిరస్మరణీయమని మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేశ్ అన్నారు. డా. ఇస్మాయిల్ 5వ వర్ధంతి సందర్భంగా ఆయన సమాధి వద్ద సోమవారం టీజీ వెంకటేశ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా టీజీ వెంకటేశ్ మాట్లాడుతూ పాతబస్తీలో ఎంతో మంది పేదలకు మెరుగైన వైద్యసేవలు అందుబాటులోకి తెచ్చిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. కరోనా వంటి క్లిష్ట సమయంలోనూ బాధితులకు మెరుగైన వైద్యసేవలు అందించడంలో ముందున్నారని తెలిపారు. చివరకు ఆ కరోనా మహమ్మారి బారినపడి డా.ఇస్మాయిల్ ప్రాణాలు కోల్పోవడం శోచనీయమన్నారు. నౌషాద్‌బాషా, కేఎం మున్వర్‌బాషా, ఎస్.అన్వర్, జహంగీర్, టీజీ వలి పాల్గొన్నారు.

పేదలకు మంచి చేయాలన్నది..

కర్నూలు అర్బన్: పేదలకు మంచి చేయాలన్నది దివంగత డా.ఇస్మాయిల్ ఆలోచనా విధానమని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖా మంత్రి టీ జీ భరత్ అన్నారు. సోమవారం ఇస్మాయిల్ వర్ధంతి సందర్భంగా కొత్తపేటలోని ఆయన సమాధి వద్ద మంత్రి టీజీ భరత్ నివాళులర్పించారు. అనంతరం టీజీ భరత్ మాట్లాడుతూ రూ. 2కే వైద్యంచేస్తూ పేదల డాక్టర్‌గా ఆయన పేరు పొందారని కొనియాడారు. దేశవ్యాప్తంగా డాక్టర్ ఇస్మాయిల్‌కు మంచి పేరు ఉందన్నారు. నగరంలోని గరీబ్‌నగర్‌కు డా.ఇస్మాయిల్ పేరు పెట్టేందుకు ఆలోచన చేస్తున్నట్లు చెప్పారు. తన తండ్రి టీజీ వెంకటేష్‌తో ఇస్మాయిల్ ఎంతో మంచి అనుబంధం ఉందన్నారు.

శేషవాహనంపై సీతారామచంద్రులు

కర్నూలు కల్చరల్, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): పాతనగరంలోని శ్రీపేట రామాలయంలో సోమవారం చైత్ర శుద్ధ విదయ రోజున మూడో రోజు ఉత్సవాల్లో భాగంగా వేకువజామునే స్వామి, అమ్మవార్లకు సుప్రభాత సేవ, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. ఏకాంత రాముని మూలమూర్తికి రకరకాల పండ్లతో ప్రత్యేకంగా అలంకరణ చేశారు. అనంతరం బ్రహ్మోత్సవ హోమం, పుణ్యాహవాచనం తదితర కార్యక్రమాలను సుధా పండితుడు, కడప ఉత్తరాది మఠాధికారి విద్యానిధి ఆచార్య జరిపించారు. సాయంత్రం శ్రీతారామ లక్ష్మణ సహిత ఉత్సవ మూర్తులను శేషవాహనంపై పాతనగరంలోని వీధుల్లో ఊరేగించారు వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు టీసీ మద్దిలేటి, క్రెడాయ్ చైర్మన్ గోరంట్ల రమణలను, వివిధ కుల సంఘాల నాయకులను ఘనంగా సత్కరించారు.

లలితాపీఠంలో పూజలు: కేరళ రాష్ట్ర ఉగాది పర్వదిన సందర్భంగా పాతనగరంలోని జమ్మిచెట్టు వీధిలోగల లలితాపీఠంలో అయ్యప్పస్వామికి విష్ణు పుజలు నిర్వహించారు. సోమవారం పీఠంలో ఏర్పాటుచేసిన భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

మార్షల్ ఆర్ట్స్‌తో క్రమశిక్షణ

కర్నూలు స్పోర్ట్స్, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): మార్షల్ ఆర్ట్స్‌తో క్రమశిక్షణ అలవడుతుందని మాజీ మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ శమంతకమణి అన్నారు. స్థానిక నరసింహారెడ్డి నగర్‌లో సుమన్ టీవీ ఆఫీసులో నగరూరు సుబ్రహ్మణ్యం చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో శమంతకమణి తైక్వాండో క్రీడాకారులకు, మాస్టర్స్‌కు దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ శిక్షకులు తైక్వాండో మాస్టర్ టి.వెంకటేశ్వర్లు, అజయ్, తేజ, నందిని సాయితీర్థ, అశ్విని, వెంకటేశ్, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తాం

కర్నూలు అర్బన్, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తామని మంత్రి టీజీ భరత్ అన్నారు. సోమవారం మౌర్య ఇన్‌లోని కాన్ఫిడరేషన్ ఆఫ్ ఉమెన్ ఎంట్రప్రెన్యూర్స్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగిన సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి ఇంటి నుంచి ఒక పారిశ్రామివేత్తను తయారు చేయాలన్న సీఎం చంద్రబాబు నాయుడు ఆలోచన విధానానికి అనుగుణంగా పని చేస్తున్నామని అన్నారు. ప్లాస్టిక్స్ పేరుతో చిరుధాన్యాలతో కేక్స్, బిస్కట్స్ తయారీపై జరిగిన 3 నెలల శిక్షణా శిబిరం ముగింపు కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో అస్ట్రేలియన్ కాన్సులేట్ జనరల్ శిలాయ్ జాకీ, కోవె నేషనల్ డైరెక్టర్ సుమన్ కుమార్, అపర్ణ, రాధిక చౌదరీ, విజయకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

మతోన్మాద వ్యతిరేక పోరాటమే జార్జిరెడ్డికి నిజమైన నివాళి

కర్నూలు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): మతోన్మాద వ్యతిరేక పోరాటమే జార్జిరెడ్డికి నిజమైన నివాళి అని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.భాస్కర్ అన్నారు. సోమవారం కర్నూలు పట్టణంలోజార్జిరెడ్డి 53వ వర్ధంతి సభ జరి గింది. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్య దర్శి మహేంద్రబాబు, నగర అధ్యక్షుడు దామోదర్, పీవైఎల్ నాయ కులు ఇమామ్‌బాషా, సురేష్, రాజు, మధు పాల్గొన్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

మహానంది, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన సోమవారం మహానంది సమీపంలోని అరటి తోటలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామంలో సోమవారం ఉదయం అరటి తోటలో పొగలు వ్యాపించడంతో సమీపంలో పనులు చేస్తున్న కూలీలు అక్కడికి వెళ్లి చూశారు. గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం మంటల్లో కాలిపోతున్నట్లుగా గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. మహానంది పోలీసులతో పాటు నంద్యాల సీఐ శ్రీనివాసరెడ్డి, మహానంది, బండిఆత్మకూర్ ఎస్ఐలు రామ్మోహన్‌రెడ్డి, జగన్ మోహన్ ఘటనాస్థలికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. అప్పటికే మృతదేహం పూర్తిగా కాలిపోయింది. అక్కడే పోస్టుమార్టం నిర్వహించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఇది హత్యనా..? ఆత్మహత్యనా అన్నది తెలియాల్సి ఉంది. మహానంది పోలీసులు అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వడదెబ్బతో ఉపాధి కూలీ..



లక్ష్మన్న (ఫైల్)

పత్తికొండ, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని హోసూరు గ్రామానికి చెందిన అడవి లక్ష్మన్న (55) సోమవారం వడదెబ్బతో మృతిచెం దారు. ఉదయం కూలీలతో పాటు ఉపాధి పనులకు వెళ్లారు. పనులు ముగి సిన తర్వాత ఇంటికి వచ్చి నిద్రకు ఉపక్రమించారు. అయితే మధ్యాహ్నం వాంతులు చేసుకున్నారు. తీవ్ర అస్వస్థతకు ఇంటి వద్దే మృతి చెందారు. అధికారులు గ్రామానికి వెళ్లి వివరాలు సేకరించారు.

విద్యుదాఘాతంతో రైతు..

డోన్ రూరల్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో రైతు మృతిచెందిన ఘటన మండలంలోని కామగానిగుంట్ల గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. మృతుడి బంధువులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన రైతు వడ్డె రమేష్ తనకున్న ఎకరా పొలంలో నీరు పారించేందుకు మోటార్ ఆన్ చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై మృతిచెందాడు. మృతదేహాన్ని డోన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గ్రామ సర్పంచ్ రాధమ్మ, గ్రామ పెద్దలు వేమారెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తి..

శిరివెళ్ల, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): బైక్ అదుపు వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని గుంప్రమాన్‌దిన్నెలో చోటుచేసుకున్నట్లు ఎస్ఐ చిన్న పీరయ్య తెలిపారు. వివరాలు. గుంప్రమాన్‌దిన్నె గ్రామానికి చెందిన వరికూటి రేణుకేశ్వర రెడ్డి (37) అనే యువకుడు ఆదివారం రాత్రి యర్రగుంట్ల గ్రామంలో పనులు ముగించు కొని బైక్‌పై స్వగ్రామమైన గుంప్రమాన్‌దిన్నెకు తిరిగి వెళ్తున్నాడు. బైక్ అదుపుతప్పి అక్కడికక్కడే మరణించాడు. ఉదయం అటుగా వెళ్తున్నవారు పోలీసులు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడు రేణుకేశ్వరరెడ్డి ఓ ప్రైవేట్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. మృతదేహాన్ని పంచనామా నిమిత్తం నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడి తండ్రి వరికూటి గోపాల్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి..



రిషికుమార్(ఫైల్)

వెల్దుర్తి, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో విద్యార్థి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. వెల్దుర్తి ఐ.జీ.నగర్‌లో నివాసం ఉంటున్న రమేష్, సుజాతకు రిషికుమార్, విక్కీ సంతానం. రిషికుమార్(14) క్రిష్ణగిరి ఆదర్శ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. సోమవారం సెలవు కావడంతో తల్లిదండ్రులకు తెలియకుండా అన్నదమ్ములు బైక్ తీసుకెళ్లారు. జాతీయ రహదారి-44పై నార్లాపురం స్టేజీ దాటాక వేగంగా లారీని ఢీ కొట్టడంతో బైక్ నడుపుతున్న రిషికుమార్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. గాయపడిన విక్కీని కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తండ్రి రమేష్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైకులు ఢీకొని యువకుడి దుర్మరణం



అజయ్‌కుమార్ (ఫైల్)

జూపాడుబంగ్లా, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. ఆదివారం మిడుతూరు మండలం కడుమూరుకు చెందిన అజయ్‌కుమార్ తర్తూరు జాతరకు బైక్‌పై వెళ్తున్నాడు. నందికొట్కూర్‌కు చెందిన ముర్తుజావలి జాతర చూసుకొని తన మోటార్ సైకిల్‌పై తిరుగు ప్రయాణమయ్యాడు. వీరి వాహనాలు ఎదురెదురుగా వచ్చి ఢీకొనడంతో ముర్తుజావలికి చేయి విరిగింది. అజయ్‌కుమార్ (21) కింద పడి స్పృహకోల్పోయాడు. నందికొట్కూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



అనిల్ (ఫైల్)

చాగలమర్రి, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): రోడ్డుపై ఆరబెట్టిన ధాన్యం కుప్పపైకి బైక్‌ను తీసుకెళ్లగా అదుపుతప్పి బోల్తాపడి సోమవారం యువకుడు మృతిచెందినట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు. వివరాలు.. మండలంలోని ముత్యాల పాడు -గొడిగెనూరు గ్రామాల సమీపంలో రోడ్డుపై ధాన్యం ఆరబెట్టారు. బైక్ వెళ్తున్న అనిల్ కుమార్(31) ధాన్యం కుప్పలోకి బైక్‌ను తీసుకెళ్లాడు. అదుపుతప్పి బోల్తాపడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. హుటాహుటిన 108లో స్థానిక కేరళ ఆస్పత్రికి తరలించగా కోలుకోలేక మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఉద్యోగం దొరకదేమోనని..

- ఉరేసుకొని యువకుడి బలవన్మరణం

కొలిమిగుండ్ల, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): ఉన్న ఉద్యోగం పోగా, ఆరు నెలలుగా ఖాళీ ఉంటూ మళ్లీ ఉద్యోగం దొరకదేమోనని మనస్థాపం చెందిన ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ విషాద ఘటన మండలంలోని తిమ్మనాయినిపేటలో సోమవారం చోటుచేసుకున్నట్లు సీఐ రమేష్‌బాబు తెలిపారు. వివరాలు. గ్రామానికి చెందిన పసల పాపన్న కుమారుడు పసల జయకృష్ణ(23) బెంగుళూరులో ఉద్యోగం చేస్తూ ఉండేవాడు. ఆరునెలల క్రితం జాబ్ పోయింది. ఇంట్లోనే ఉంటూ ఉద్యోగ ప్రయత్నాలు కొనసాగిస్తున్నాడు. ఇక తనకు ఉద్యోగం దొరకదని మనస్థాపం చెందాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తండ్రి పాపన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

అదనపు కట్నం వేధింపుల కేసు నమోదు

కొలిమిగుండ్ల, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కనకాద్రి పల్లెకి చెందిన శ్రీవిద్య అనే వివాహితను భర్త, అత్త మామలు అదనపు కట్నం కోసం వేధిస్తున్నారన్న ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసినట్లు సీఐ రమేష్‌బాబు తెలిపారు. వివరాలు.. గ్రామానికి చెందిన శ్రీవిద్యకు పవన్‌కుమార్‌తో ఆరేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఒక కొడుకు, కూతురు ఉన్నారు. కొన్నాళ్లు వీరి కాపురం సవ్యంగా సాగింది. కొంత కాలంగా అదనపు కట్నం తేవాలంటూ భర్త, అత్తమామలు వేధించ సాగారు. నాలుగు నెలల క్రితం అదనపు కట్నం తెచ్చేదాకా రావద్దంటూ ఇంట్లో నుంచి గెంటేశారు. అప్పటి నుంచి శ్రీవిద్య పుట్టింట్లో ఉంటుంది. వారిలో మార్పు రాకపోవడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

పార్థసారథి నగర్‌లో చోరీ

కర్నూలు క్రైం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): మూడో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో పార్థసారథి నగర్‌లో ఇంట్లో చోరీ జరిగింది. రాంగోపాల్ అనే వ్యక్తి ఇంట్లో ఆరున్నతర తులాల బంగారు నగలు, 50తులాల వెండి నగలు చోరీకి గురయ్యాయి. రాంగోపాల్ ఈనెల 12న కుటుంబ సభ్యులతో కలిసి ఊరెళ్లాడు. తిరిగి సోమవారం ఇంటికి వచ్చి చూస్తే ఇంటి తలుపులు తెరిచి ఉన్నాయి. ఇంట్లో ఉన్న నగలు చోరీకి గురైనట్లు గుర్తించారు. పోలీసులకు సమాచారమివ్వడంతో వారు ఘటనాస్థలికి చేరుకొని వివరాలు సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కార్పొరేట్ హాస్పిటళ్లకు సమానంగా సౌకర్యాలు



మాట్లాడుతున్న పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్

- పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్
- ఆసుపత్రిలో సేవలన్నీ కంప్యూటరైజ్డ్
- డయాగ్నోస్టిక్ బ్లాక్‌లో పరీక్షల నివేదికలు త్వరగా ఇవ్వాలి
- మరిన్ని క్యాంటీన్లు, జీవనాధార కేంద్రాల ఏర్పాటు
- 20 నెలల తర్వాత జరిగిన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం

కర్నూలు హాస్పిటల్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో కార్పొరేట్‌కు దీటుగా రోగులకు భరోసా కల్పించేలా మెరుగైన వైద్యం, సౌకర్యాలు కల్పించాలని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి టీజీ భరత్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో హాస్పిటల్ డెవలప్‌మెంట్ కమిటీ (హెచ్‌డీఎస్) సమావేశం కలెక్టర్ పి.రంజిత్ బాషా అధ్యక్షతన జరిగింది. మంత్రి టీజీ భరత్, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, పాణ్యం, కోడుమూరు ఎమ్మెల్యేలు గౌరు చరితారెడ్డి, బొగ్గుల దస్తగిరి, కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.కె.వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ డా.కె.చిట్టి నరసమ్మ హాజరయ్యారు.

- మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ ఆసుపత్రిలో ఇంకా ఇండెంట్స్ మాన్యువల్‌లో ఉంటున్నాయని, ఏదీ కూడా ఆఫ్‌లైన్‌లో ఉండకూడదని వచ్చే సెప్టెంబరులోపు రోగులకు అందించే అన్ని సేవలు ఆన్‌లైన్‌లో కంప్యూటరైజ్ చేయాలని ఆదేశించారు. ఇంత పెద్ద ఆసుపత్రిలో పార్కింగ్ ఎందుకుచేయలేక పోతున్నారని మంత్రి మండిపడ్డారు. లిఫ్టులు, జనరేటర్ల పనులన్నీ సీఎంసీ కిందకు తీసుకురావాలని మంత్రి సూచించారు. ఏ పరికరాలైన సీఎంసీ కింద ఉండే విదంగా కొటేషన్ తీసుకోవాలన్నారు.
- ఆసుపత్రిలో 24 గంటలు కరెంటు ఉండేలా కరెంటు పోయిన వెంటనే వచ్చే విదంగా ఆటోమేటిక్ వ్యవస్థను ఏర్పాటు చేయాలన్నారు.
- పందుల సంచారం ఎక్కువగా ఉందని, దీనిపై చర్యలు తీసుకోవాలని, పందుల పెంపకందారులను పిలిపి పోలీసులు మాట్లాడాలని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు అధికారులకు సూచించారు.
- ఆసుపత్రిలో మరికొన్ని క్యాంటీన్లు జీవనధార షాపులను రోగులకు అనుగుణంగా ఏర్పాటు చేయాలన్నారు. ఆసుపత్రికి ఓపీ ల్యాడ్స్ నిధులతో అంబులెన్సులు ఇస్తామని హామీ ఇచ్చారు.

కార్యక్రమంలో ఆసుపత్రి సీఎస్ఆర్ఎంవో డా.బి.వెంకటేశ్వరరావు, డీఎంహెచ్‌వో డా.పి. శాంతికళ, డీసీహెచ్ఎస్ డా.శ్రీనివాసులు, కంటి ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.వెంకటేశ్వర్లు, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ సింధు సుబ్రమ్మణ్యం, మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు, హెచ్‌డీఎస్ సభ్యులు బైసాని పద్మజ, బోయ రామాంజనేయులు, సాయిప్రదీప్, రంగనాథరెడ్డి, డా.ప్రవీణ్ పాల్గొన్నారు.

ఆమోదించిన తీర్మానాలు

- కొత్త సిటీ స్కాన్ కోసం ఎంఎన్‌వో/ ఎఫ్ఎన్‌వో, ఇతర సిబ్బంది నియమించేందుకు నివేదికలు ఇవ్వాలి.
- ఆసుపత్రిలో రోగుల సంఖ్యను బట్టి మరిన్ని జీవనాధార, క్యాంటీన్లు ఏర్పాటు
- ప్రధాన ద్వారం ఇన్‌గేటు ఏర్పాటుకు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడానికి కమిటీ ఏర్పాటు.
- ఏపీఎంఎస్ఐడీసీ ఇంజనీర్లు నిర్వహించే సివిల్ పనులు వేగవంతం చేయాలని, క్యాజువాల్టీ బాత్‌రూమ్‌లు, ఇతర విభాగల్లో డ్రైనేజీ లైన్లను ఎస్‌టీపీకి అనుబంధించడం సూపర్ స్పెషాలిటీ ఓపీ కౌంటర్లను త్వరగా నిర్మాణాలు చేపట్టాలి.
- మార్చురీలో ఆరు బాడీ ఫ్రీజర్లను హెచ్‌డీఎస్, సీడీఎస్ నిధుల కింద కొనుగోలు చేయాలి.
- కంప్యూటరైజ్ చేయాలి
- ఐపీడీ బ్లాక్ నిధులను తెప్పించడానికి కృషి చేయాలని తీర్మానం చేశారు.

నిర్ధారణ పరీక్షల రిపోర్టులు త్వరగా ఇవ్వాలి : గౌరు చరితారెడ్డి, పాణ్యం ఎమ్మెల్యే



న్యూ డయాగ్నోస్టిక్ బ్లాకులో రోగ నిర్ధారణ పరీక్షలు నివేదికలు ఆలస్యం అవుతున్నాయని, రోగులకు రిపోర్టులు త్వరగా అందించేలా చర్యలు తీసుకోవాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి సూచించారు. ఆసుపత్రిలో ఆరోగ్య పరీక్షల వివరాలు రిపోర్టులను ఇస్తే వైద్యం త్వరగా అందుతుందని, వీలతై వాట్సాప్ మెసేజ్ ద్వారా రిపోర్టులు ఇవ్వాలని కోరారు. మార్చురీలో సౌకర్యాలు కల్పిం చాలని శానిటేషన్, సెక్యూరిటీ సేవలు సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.

మరిన్ని ట్రాలీలు, వీల్‌చైర్లు ఏర్పాటు చేయాలి : బొగ్గుల దస్తగిరి, కోడుమూరు ఎమ్మెల్యే



రోగుల పరీక్షల కోసం అవస్థలు పడుతున్నారని, వీల్ చైర్లు ట్రాలీలను అదనంగా ఏర్పాటు చేయాలని కోడుమురు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి కోరారు. ఐసీయూలో ఫ్లోరింగ్ సరిగ్గా లేదని సిటీ స్కాన్ వద్ద రద్దీ ఉందని, అదనంగా ఏర్పాటు చేయాలని కోరారు.

అడిషినల్ డీఎంఈ డా. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఫోరెన్సిక్ విభాగంలోని ఎలక్ట్రిషన్ పనులు పునరుద్దరించాలని, హెచ్‌డీఎస్ నిధులతో మూడు, సీడీఎస్ నిధులతో మూడు, బాడీ ఫ్రీజర్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

సమావేశం స్థలం మార్పు ఎందుకో..?

- మధ్యాహ్నం తరువాత కలెక్టరేట్‌కు వేదిక మార్పు

కర్నూలు జీజీహెచ్ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహణ స్థలం మారింది. సోమవారం మధ్యాహ్నం 1 గంట వరకు హెచ్‌డీఎస్ సమావేశం జీజీహెచ్‌లోని ధన్వంతరీ హాలులో నిర్వహిస్తున్నట్లు అధికారులు చెబుతూవచ్చారు. గతంలో కూడా ఆసుపత్రిలోనే హెచ్‌డీఎస్ సమావేశం జరిగింది. హెచ్‌డీఎస్ సమావేశం కోసం అధికారులు ధన్వంతరీ హాలులో అన్ని ఏర్పాట్లు చేశారు. అక్కడ జనరేటర్ సౌకర్యం కూడా కల్పించారు. అయితే సోమవారం ఉన్న ఫళంగా మధ్యాహ్నం హెచ్‌డీఎస్ సమావేశం వేదికను కలెక్టరేట్‌కు మార్చడంపై చర్చ జరుగుతోంది. ఆసుపత్రిలో సమావేశం నిర్వహిస్తే వాడివేడిగా చర్చ జరుగుతుంది. కలెక్టరేట్‌లో నిర్వహించడంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. సమావేశాన్ని విలేకరులు లేకుండా నిర్వహించడం వెనుక మతలబు ఏమిటని పలువురు చర్చించుకుంటున్నారు.

సమానత్వం ఇచ్చిన అంబేడ్కర్



అంబేడ్కర్ చిత్రపటానికి సెల్యూట్ చేస్తున్న ఎస్పీ

నంద్యాల టౌన్ ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగం ద్వారా అందరికి సమానత్వం కల్పించిన వ్యక్తి అంబేడ్కర్ అని ఎస్పీ ఆదిరాజ్ సింగ్ రాణా పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఎస్పీ కార్యాలయంలో అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మేధావిగా, సంఘ సంస్కర్తగా దేశానికి ఎన్నో సేవలు అందించారన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

20 వరకు అగ్నిమాపక వారోత్సవాలు

నంద్యాల టౌన్ ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): ఈనెల 14 నుంచి 20వ తేది వరకు అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా సహాయ అగ్నిమాపక అధికారి యోగేశ్వరరెడ్డి తెలిపారు. సోమవారం అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..1944లో నౌకకు జరిగిన అగ్నిప్రమాదంలో బొంబాయి ఫైర్ సర్వీసు చెందిన 66 మంది, ప్రజలు 231 మంది చనిపోయారని వారి స్మారకార్థం దేశ ప్రభుత్వం ఈ వారోత్సవాలు నిర్వహిస్తుందని తెలిపారు. అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య ఆరోగ్య మంత్రి పర్యటనకు ఏర్పాట్లు

- అకాడమిక్ డీఎంఈ డా. వెంకటేశ్వర్లు

కర్నూలు హాస్పిటల్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 19వ తేదీ కర్నూలు స్టేట్ క్యాన్సర్ హాస్పిటల్ ప్రారంభోత్సవానికి వస్తున్న వైద్యఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ పర్యటనకు ఏర్పాట్లు చేయాలని అకాడమిక్ డీఎంఈ డా.వెంకటేశ్వరరావు అధికారులను ఆదేశించారు. సోమవారం స్టేట్ క్యాన్సర్ హాస్పిటల్, కర్నూలు మెడికల్ కాలేజీ, హాస్పిటల్‌ను సందర్శించారు. అనంతరం మెడికల్ కాలేజీ ఆవరణలోని కాన్ఫరెన్స్ హాలులో హెచ్‌వోడీలతో సమీక్ష నిర్వహించారు. అత్యవసరమైన వసతులు పరికరాలు సమస్యల నివేదిక తయారు చేసుకోవాలన్నారు. సమీక్షలో కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డా.కే.చిట్టి నరసమ్మ, సూపరింటెండెంట్ డా.కే.వెంకటేశ్వర్లు, సీఎస్ఆర్ఎంవో డా.బి.వెంకటేశ్వరరావు హెచ్‌వోడీలు పాల్గొన్నారు.

అయ్యో పాపం

- నవజాత శిశువు మృతదేహం

నంద్యాల టౌన్ ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): నంద్యాల పట్టణంలోని శ్రమదానం బ్రిడ్జి వద్ద గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం నవజాత శిశువు శవాన్ని చెత్తలో పడేసి వెళ్లిపోయారు. ఆడ శిశువు మృతదేహాన్ని అట్ట పెట్టెలో పెట్టి చెత్తలో పడేశారని స్థానికులు నంద్యాల రెండో పట్టణ సీఐ ఇస్మాయిల్‌కు సమాచారం ఇచ్చారు. పోలీసులు అక్కడికి చేరుకొని పరిశీలించి, మున్సిపల్ వారికి అప్పజెప్పడంతో వారు పాప మృతదేహాన్ని తీసుకుని వెళ్లి ఖననం చేశారు. దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చైన్ స్నాచర్ల అరెస్ట్



నిందితులను చూపుతున్న ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా

నంద్యాల టౌన్ ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): పలు గొలుసు దొంగతనం కేసుల్లో ముద్దాయిలుగా ఉన్న దూదేకుల షహీద్ వలి, పింజరి దస్తగిరిలను నంద్యాల పట్టణంలోని ఆర్‌కే ఫంక్షన్ హాల్‌వద్ద ఒకటో పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. సోమవారం స్థానిక జిల్లా కార్యాలయంలో ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా వివరాలు తెలిపారు. వీరి వద్ద నుంచి 4 తులాల తాళిబొట్టు బంగారు గొలుసు, 2.3 బంగారు గొలుసు, హోండా షైన్ బైక్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీరు గతంలో కూడా పలు గొలుసు దొంగతనం కేసుల్లో ఉన్నారని జైలుకు కూడా వెళ్లి వచ్చినట్లు తెలిపారు. సీఐ సుధాకర్‌రెడ్డి, సురేశ్‌కుమార్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నిందితుడి అరెస్టు

నంద్యాల టౌన్ ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): నంద్యాల, గుంటూరు జిల్లాల్లో వివిధ పోలీసు స్టేషన్ల పరిధిలో జరిగిన దోపిడీలు, బందిపోటు దొంగతనాలు చేసి తప్పించుకుని తిరుగుతున్న మేకల హనుమంతును అరెస్టు చేసినట్లు ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా తెలిపారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ రెండు జిల్లాలో పలు దొంగతనాలు, దారి దోపిడీ కేసుల్లో నిందితుడైన హనుమంతు పాములపాడు మండలం వేంపేంట గ్రామం జగన్ కాలనీలో నివాసం ఉంటున్నాడని తెలిపారు. సోమవారం పాణ్యం వద్ద జంబులమ్మ ఆర్చీ గుడి వద్ద అదుపులోకి తీసుకొని అతని వద్ద నుంచి 5 తులాల బంగారం, 30 తులాల వెండి, రూ.12వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సీఐలు కిరణ్‌కుమార్‌రెడ్డి, సురేశ్‌కుమార్, ఎస్సై నరేంద్ర కుమార్‌రెడ్డి పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బాలుడిని కబళించిన నీటిగుంత

- నంద్యాల పార్కులో విషాదం

నంద్యాల హాస్పిటల్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): పార్కులో ఆడుకుంటున్న బాలుడికి నీటిగుంత మృత్యువు రూపంలో కబళించింది. అన్న కళ్లముందే తమ్ముడు మృత్యుఒడికి చేరిన హృదయ విదారక ఘటన సోమవారం నంద్యాల పట్టణంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. మున్సిపల్ హైస్కూల్ పక్కన ఉన్న పార్కులో అన్నదమ్ములిద్దరూ ఆడుకుంటూ నీరు నిల్వ ఉన్న గుంతలో పడ్డారు. దాదాపు 7అడుగుల గుంతలో నీరు ఉండటంతో అన్న అలీ ఇతరుల సాయంతో బయటపడగా, తమ్ముడు అయాన్(7) గుంతలో ఇరుక్కుని మరణించాడు. చాంద్‌బాడకు చెందిన మన్సూర్, రజియాలకు ఇద్దరు కుమారులు. ఇరువురు పట్టణంలోని ఓప్రైవేట్ పాఠశాలలో విద్యాభ్యాసం చేస్తున్నారు. సోమవారం సాయంత్రం పార్కుకు వెళ్లి ఆడుకుంటూ మరణించడంతో కుటుంబంలో విషాదచాయలు అలుముకున్నాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల జీజీహెచ్‌కు తరలించారు. పోస్టుమార్టం గదివద్ద కుటుంబసభ్యుల రోదన పలువురిని కలచివేసింది.



బాలుడి మృతికి కారణమైన గుంత ఇదే

రక్షణ కవచాలు ఏర్పాటు చేయకపోవడంతో...

పట్టణంలోని మున్సిపల్‌పార్కులో ఫిల్టర్‌బెడ్ కోసం చేపట్టిన నిర్మాణంలో భాగంగా దాదాపు 7అడుగుల గుంతలు తవ్వారు. ఇటీవల కురిసిన వర్షాలు, ఫిల్టర్‌బెడ్ క్యూరింగ్‌కోసం పోసిన నీటితో గుంత నిండిపోయింది. ప్రమాదకరమని తెలిసినా ఆ గుంతచుట్టూ రక్షణ కవచాలు ఏర్పాటు చేయకపోవడం బాలుడి మృతికి కారణమని తెలుస్తోంది. పనులను పర్యవేక్షించాల్సిన మున్సిపల్ అధికారులు, కాంట్రాక్టర్ రక్షణ చర్యలు తీసుకోకపోవడంపట్ల పలువురు మండిపడుతున్నారు. ఈ పనులు దాదాపు 3నెలల నుంచి చేస్తున్నట్లు సమాచారం.

మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రారెడ్డి ఆస్పత్రిలో అయాన్ మృతదేహాన్ని పరిశీలించి, కుటుంబసభ్యులను ఓదార్చారు. ఆయన వెంట ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా తదితరులు ఉన్నారు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

భావోద్వేగాలు నిండిన చిత్రం



- ప్రదీప్ చిలుకూరి

'రాజా చెయ్యివేస్తే' ఫేమ్ ప్రదీప్ చిలుకూరి తెరకెక్కించిన చిత్రం 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి'. కల్యాణ్ రామ్ కథానాయకుడిగా నటించారు. ఎన్టీఆర్ ఆర్ట్ బేనర్‌పై అశోక్‌వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు నిర్మించారు. ఈనెల 18న సినిమా విడుదలవుతున్న సందర్భంగా మీడియాతో ముచ్చటించారు దర్శకుడు ప్రదీప్ చిలుకూరి. "కల్యాణ్‌రామ్‌తో ఓ మాస్ సినిమా చేద్దామని ఆలోచిస్తున్న సమయంలో ఓ ఆసక్తికరమైన ఐడియా పుట్టింది. వెంటనే ఆ లైన్‌ను కల్యాణ్‌రామ్‌కు చెబితే, ఆయనకు నచ్చింది. కానీ, అందులో తల్లి పాత్రలో విజయశాంతి నటిస్తేనే ముందుకు వెళ్దామని చెప్పారు. విజయశాంతికి కూడా తన పాత్ర నచ్చడంతో అంగీకరించారు. ఈ సినిమాలో క్లైమాక్స్ కీలకం. ఓ తల్లి కోసం తనయుడు ఏం చేసినా తక్కువే అని చూపించే పతాక సన్నివేశాలు ప్రేక్షకులను కంటతడి పెట్టిస్తాయి. 'అమిగో', 'డెవిల్' లాంటి ప్రయోగాత్మక చిత్రాలు చేసిన తర్వాత కల్యాణ్‌రామ్ చేసిన పూర్తి స్థాయి యాక్షన్ చిత్రమిది. భావోద్వేగాలు, అద్భుతమైన పోరాట ఘట్టాలు గల ఈ సినిమా మాస్ ఆడియెన్స్‌తో పాటు కుటుంబ ప్రేక్షకులకూ నచ్చుతుంది. కల్యాణ్‌రామ్, విజయశాంతి మధ్య వచ్చే సన్నివేశాలు, సంభాషణలు, సంగీతం ఈ సినిమాకు ప్రధానాకర్షణ. తప్పకుండా విజయం సాధిస్తుంది" అని చెప్పారు.

సరికొత్త అనుభూతినిస్తుంది



- సంపత్‌నంది

దర్శకుడు సంపత్‌నంది దర్శకత్వ పర్యవేక్షణలో తెరకెక్కిన చిత్రం 'ఓదెల 2'. 2022లో విడుదలై ఘన విజయం సాధించిన 'ఓదెల రైల్వేస్టేషన్' చిత్రానికి ఇది సీక్వెల్. ఈ చిత్రానికి సంపత్ నంది కథను అందించి సమర్పకుడిగా వ్యవహరించారు. అశోక్ తేజ దర్శకత్వంలో మధు నిర్మించారు. ఈ నెల 17న సినిమా విడుదలవుతున్న సందర్భంగా మీడియాతో ముచ్చటించారు సంపత్‌నంది. "ఈ సినిమా మొదటి భాగం తీస్తున్నప్పుడు పార్ట్ 2 గురించి ఆలోచించలేదు. కానీ చివరలో లీడ్ అయితే ఇచ్చాం. మొదటి భాగంలో హెబ్బా క్యారెక్టర్ సినిమాకే ప్లస్ అయ్యింది. అందుకే ఇందులో దుష్టశక్తితో పోరాడేందుకు ఓ బలమైన ఫిమేల్ క్యారెక్టర్ ఉంటే బాగుంటుందనిపించి తమన్నా పాత్రను సృష్టించాం. ఓ ఆత్మకు, సూపర్ నేచురల్ పవర్స్‌కు మధ్య జరిగే ఆసక్తికరమైన పోరు ఈ సినిమా కథాంశం. ప్రేక్షకులకు సరికొత్త విజువల్ అనుభూతిని పంచుతుంది. ఈ కథను రాసేందుకు చాలా పరిశోధన చేశాం. శివశక్తి, నాగసాధువులుగా మారతారని, శివాలయాలను శుద్ధి చేస్తారని.. ఇలా ఎన్నో విషయాలు తెలుసుకున్నాం. ఆ క్రమంలోనే ఈ సినిమాలో శక్తిమంతమైన నాగసాధు పాత్ర తయారైంది. తమన్నా ఇందులో తన లుక్ కోసం చాలా శ్రమించారు. సినిమాలో గ్రాఫిక్స్ పార్ట్ అధికంగా ఉంటుంది. ఆ విజువల్ ఎఫెక్ట్స్ ప్రేక్షకులకు థ్రిల్‌ను పంచుతాయి. దర్శకుడు అశోక్ ప్రతిభావంతుడు. ఆయన మేకింగ్ అదిరిపోతుంది" అని చెప్పారు.

మరోసారి గెలిపిస్తారనే నమ్మకం ఉంది



నాని

నాని కథానాయకుడిగా 'హిట్' చిత్రాల ఫేమ్ శైలేష్ కొలను తెరకెక్కించిన చిత్రం 'హిట్ 3'. శ్రీనిధి శెట్టి కథానాయిక. వాల్‌పోస్టర్ సినిమా పతాకంపై ప్రశాంతి తిపిర్నేని నిర్మించారు. మే ఒకటిన చిత్రం విడుదలవుతోంది. ఇటీవలే విడుదలైన టీజర్, పాటలు సినిమాపై అంచనాలను తారస్థాయికి తీసుకెళ్లాయి. సోమవారం చిత్రట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో నాని మాట్లాడుతూ "ఈ మధ్య వస్తున్న సినిమాల ట్రైలర్‌లు ఆ సినిమాల విడుదలకు ఒక రోజో.. రెండు రోజుల ముందో వస్తున్నాయి. కానీ, ఒకప్పుడు ట్రైలర్‌లు సినిమా విడుదలకు 20 రోజుల ముందే విడుదల అయ్యేవి. అందుకే ఆ పాత రోజుల్ని గుర్తుచేయాలనే ట్రైలర్‌ను ముందుగానే విడుదల చేశాం. తెలుగు ప్రేక్షకులకు పరిచయం లేని ఓ సరికొత్త జానర్‌లో చేసిన చిత్రమిది. కొత్తగా ప్రయత్నించిన ప్రతీసారి ప్రేక్షకులు గెలిపించారు. మే ఒకటిన మరోసారి గెలిపిస్తారనే నమ్మకం ఉంది. నేను యాక్షన్ సినిమాలు చేయాలని కోరుకునే వాళ్లంతా ఆ రోజు థియేటర్లకు వచ్చేయండి. నేను లవ్‌స్టోరీలు, ఫీల్ గుడ్, కామెడీ, కుటుంబ చిత్రాలు చేయాలనుకునే వారు ఆ రోజు కాస్త జాగ్రత్తగా ఉండండి. సినిమా అందరినీ ఆకట్టుకుంటుంది. బలమైన భావోద్వేగాలతో నిండిన యాక్షన్ సన్నివేశాలు ప్రేక్షకులకు పూనకాలు తెప్పిస్తాయి" అని చెప్పారు. "సినిమా యూనిక్‌గా ఉంటుంది. నాని నటన ఈ సినిమాను మరో లెవెల్‌కు తీసుకెళ్తుంది. ప్రతీ సన్నివేశం విజిల్స్ కొట్టేలా ఉంటుంది. 'అర్జున్ సర్కార్' ప్రేక్షకులకు చిరకాలం గుర్తుండిపోతాడు" అని దర్శకుడు శైలేష్ కొలను చెప్పారు.

విజువల్ వండర్



'అమరన్'తో సూపర్‌హిట్ అందుకున్న తమిళ నటుడు శివకార్తికేయన్ నటిస్తున్న చిత్రం 'మదరాసి'. ఏ.ఆర్.మురుగదాస్ దర్శకత్వంలో శ్రీలక్ష్మి మూవీస్ నిర్మిస్తోంది. రుక్మిణీ వసంత్ కథానాయిక. విద్యుత్ జామ్వాల్, బిజు మీనన్, షబీర్, విక్రాంత్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. తాజాగా, ఈ సినిమా విడుదల తేదీని ఖరారు చేస్తూ ఓ పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్. సెప్టెంబరు 5న చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. విజువల్ వండర్‌గా తెరకెక్కుతోన్న ఈ సినిమా ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇస్తుందని పేర్కొన్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: శ్రీకర్ ప్రసాద్, సినిమాటోగ్రాఫర్: సుదీప్ ఎలామోన్, సంగీతం: దేవిశ్రీ ప్రసాద్.

పారితోషికాల్లో వ్యత్యాసం ఎందుకు?



ఇండస్ట్రీలో హీరో, హీరోయిన్ ఒకేలా కష్టపడుతున్నప్పుడు పారితోషికాల్లో వ్యత్యాసం ఎందుకని నటి సమంత ప్రశ్నించారు. కథానాయికలు ఈ విషయంలో ఎన్నో సవాళ్లు ఎదుర్కొంటున్నారని అన్నారు. సినీ పరిశ్రమలో నెలకొన్న ఈ అసమానతలపై సమంత ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ 'హీరో, హీరోయిన్ సమాన ప్రాతినిధ్యం ఉన్న పాత్రల్లో నటించినప్పటికీ పారితోషికం విషయంలో మాత్రం వ్యత్యాసం ఉంటోంది. పరిశ్రమలో నన్ను ఇబ్బందిపెట్టే విషయాల్లో ఇదొకటి. దీనిలో మార్పు తీసుకురావాలని ప్రయత్నిస్తున్నా. గత పరిస్థితులను నేను మార్చలేను. మార్పు నాతోనే మొదలవ్వాలని నా సంస్థలో ఇలాంటి వ్యత్యాసం రాకుండా చూసుకుంటున్నాను' అని చెప్పారు.

జాట్ దర్శకుడికి తమిళుల హెచ్చరిక



బాలీవుడ్ హీరో సన్నీ డియోల్ హీరోగా తెలుగు దర్శకుడు గోపిచంద్ మలినేని తెరకెక్కించిన చిత్రం 'జాట్'. మైత్రీ మూవీ మేకర్స్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ సంస్థలు సంయుక్తంగా నిర్మించాయి. ఇటీవలె విడుదలైన ఈ చిత్రాన్ని బహిష్కరించాలని కోరుతూ సోషల్ మీడియా 'ఎక్స్'లో 'బాయ్‌కాట్ మూవీ' హ్యాష్ ట్యాగ్ వైరల్ అవుతోంది. ఎల్‌టీటీఈని ఒక ఉగ్రవాద సంస్థగా ఈ సినిమాలో చిత్రీకరించారంటూ కొందరు తమిళులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమిళనాడులో అడుగుపెడితే దర్శకుడు గోపిచంద్ మలినేనికి తగిన బుద్ధి చెబుతామంటూ పోస్టులు పెడుతున్నారు. ఈ సినిమాలో ఎల్‌టీటీఈ పేరు ప్రస్తావించనప్పటికీ ఆ మార్క్ చూపుతూ సినిమా తీశారని కొందరు తమిళులు ఆరోపిస్తున్నారు.

తమిళ భాషకు డిజిటల్ మెమోరియల్



ప్రపంచ ప్రాచీన భాషగా గుర్తింపు పొందిన తమిళానికి మరింత గుర్తింపు తెచ్చేలా 'డిజిటల్ మెమోరియల్'ని రూపొందించనున్నట్లు సంగీత దర్శకుడు, ఆస్కార్ అవార్డు గ్రహీత ఏఆర్ రెహ్మాన్ వెల్లడించారు. తమిళ నూతన సంవత్సరాదిని పురస్కరించుకుని ఆయన తన ఎక్స్ ఖాతా వేదికగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న తమిళ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన తన సందేశాన్ని వెల్లడిస్తూ, 'ప్రపంచ స్థాయి భాషలలో పరిణామం చెందుతూ అత్యంత శక్తిమంతమైన భాషగా తమిళం గుర్తింపు పొందింది. తమిళ భాషను ప్రపంచ వ్యాప్తం చేయడంలో తమిళ సంఘాల కృషి ముఖ్యమైనది. భాషను బలోపేతం చేయడంతో పాటు సవరణలు చేయడం ద్వారా దానిని సుసంపన్నం చేయడంలో ముఖ్యమైన పాత్రను పోషించాయి. వినూత్నమైన, అర్థవంతమైన మార్గాల్లో తమిళ భాషను తరువాతి తరానికి తీసుకెళ్ళాల్సిన బాధ్యత మనకుంది. తమిళ సాహిత్యం, సంస్కృతులను డిజిటలీకరణ చేసేందుకు, తమిళ భాషకు మరింత గౌరవం కల్పించేలా తమిళ సాహిత్యాన్ని వివిధ రూపాల్లో ప్రదర్శించేందుకు ఏఆర్ఆర్ ఇమ్మర్సివ్ ఎంటర్‌టైన్మెంట్ (ఏఆర్ఆర్ స్టూడియో) కృషి చేస్తుంది. తమిళ గౌరవాన్ని డిజిటల్ రెండరింగ్‌గా తయారు చేసేపనిలో నిమగ్నమై ఉంది. ఇది తమిళ భాష భవిష్యత్‌కు ఒక గర్వకారణంగా నిలుస్తుందని భావిస్తున్నాం' అని రెహ్మాన్ పేర్కొన్నారు.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

బాలీవుడ్ చిత్రంలో పృథ్వీరాజ్



'ఎల్-2:ఎంపురాన్' చిత్రంతో దర్శకుడిగా విజయం సాధించారు మలయాళ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్. ఇప్పుడు బాలీవుడ్ చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలను అధికారికంగా ప్రకటించారు. మేఘనా గుల్జార్ నిర్మించనున్న 'దైరా' అనే మూవీలో పృథ్వీరాజ్ శక్తిమంతమైన పోలీస్ అధికారి పాత్రలో కనిపించనున్నారు. ఆయన సరసన బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కరీనాకపూర్‌ని ఎంపిక చేశారు. ఈ సినిమా గురించి పృథ్వీరాజ్ మీడియాతో మాట్లాడుతూ 'స్క్రిప్ట్ వినగానే ఆసక్తిగా అనిపించింది. ప్రేక్షకులకు కనెక్ట్ అయ్యే పాత్ర నాది. నేను ఇండస్ట్రీకి వచ్చి 25 ఏళ్లు అయిన సందర్భంగా ఈ సినిమాలో నటిస్తున్నందుకు సంతోషంగా ఉంది. ఈ ప్రాజెక్టుపై కరీనా కూడా ఆనందం వ్యక్తం చేశారు' అని చెప్పారు.

ఏదో జరిగినే యెద లోపలా..



రాహుల్ విజయ్, నేహా పాండే జంటగా అశోక్‌రెడ్డి దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రం 'ఖేల్ ఖతమ్ దర్వాజ బంద్'. వేదాన్ష్ క్రియేటివ్ వర్క్స్ బ్యానర్‌పై అర్జున్ దాస్యన్ నిర్మించారు. త్వరలో విడుదలకు సిద్ధమవుతున్న ఈ సినిమా నుంచి 'ఏదో ఏదో..' అనే పాటను చిత్రబృందం సోమవారం విడుదల చేసింది. పూర్ణాచారి సాహిత్యానికి సురేశ్ బొబ్బిలి సంగీతం సమకూర్చారు. కార్తీక్, హరిణి ఆలపించారు. 'ఏదో ఏదో ఏదో జరిగెనే యెద లోపలా, ఏవో ఏవో కలలు విరిసినే, నిన్నా మొన్నా లేదే..' అంటూ ఆకట్టుకునేలా సాగుతుందీ పాట.

వేశ్య పాత్ర... రీ ఎంట్రీ!



శివాజీ, నవదీప్, బిందు మాధవి ప్రధాన పాత్రల్లో మురళీకాంత్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'దండోరా'. లౌక్య ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై 'కలర్‌ఫొటో', 'బెదురులంక 2012' వంటి విజయవంతమైన చిత్రాలను నిర్మించిన రవీంద్ర బెనర్జీ ముప్పానేని ఈ చిత్రానికి నిర్మాత. ఈ చిత్రం రెండో షెడ్యూల్ శరవేగంగా సాగుతోంది. 25 రోజులపాటు కొనసాగే చిత్రీకరణలో నటి బిందు మాధవి భాగమయ్యారు. చాలా కాలం తర్వాత బిందు మాధవి ఈ సినిమా ద్వారా రీ ఎంట్రీ ఇస్తున్నారు. ఇందులో ఆమె వేశ్య పాత్రలో నటిస్తున్నారు. ప్రముఖ సంగీత దర్శకుడు మార్క్ కె.రాబిన్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు.

ఐదుగురు పిల్లల తల్లికి అత్యుత్తమ మార్కులు

- ఆమె విద్యాకాంక్షే విజేతను చేసింది
- ఎన్నో అవమానాలు.. చీత్కారాలను అధిగమించి
- భార్యకు సహకరించి అందరి నోరు మూయించిన భర్త



తబసుమ్

చదువు ఆమె జీవితాకాంక్ష. పదో తరగతిలో 357 మార్కులతో ఉర్దూ స్కూలు ఫస్టు వచ్చింది. కానీ ఇంటర్‌లో చేరలేకపోయింది. దగ్గరిలో ఉర్దూ జూనియర్ కాలేజీ లేకపోవడమే కారణం. ఇది 2007-08 నాటి మాట. ఆ తర్వాత పెళ్లయింది. ఐదుగురు పిల్లల తల్లి అయింది. అయినా చదువు మీద ధ్యాస పోలేదు. భర్త ఆమె ఆకాంక్షకు అక్షర రూపం ఇచ్చాడు. 34 ఏళ్ల వయసులో చంటి బిడ్డతో కాలేజీకి వెళ్లింది. ఈ ఏడాది ఇంటర్ రెండో సంవత్సరం అత్యుత్తమ మార్కులతో పాసైంది తబసుమ్.



భర్త, పిల్లలతో తబసుమ్

నంద్యాల ఎడ్యుకేషన్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): కోవెలకుంట్ల గ్రామానికి చెందిన షేక్ కేహెచ్ తబసుమ్‌కు బాగా చదువుకొని ఉద్యోగం చేయాలనే కోరిక ఉండేది. 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు కోవెలకుంట్ల ఉర్దూ పాఠశాలలో చదివింది. 2007-08 సంవత్సరంలో పదో తరగతిలో 357 మార్కులతో స్కూల్ ఫస్ట్ వచ్చింది. దీంతో ఆమె చదవాలన్న కోరిక మరింత బలపడింది. అయితే పరిస్థితులు అనుకూలించలేదు. కోవెలకుంట్లలోగాని, ఆళ్లగడ్డ కాని, నంద్యాలలో కాని ఉర్దూ జూనియర్ కళాశాల లేదు. కర్నూలుకు పంపించి చదివించే ఆర్థిక స్థోమత తల్లిదండ్రులకు లేదు. దీంతో చదువు ఆగిపోయింది. 2010లో తబసుమ్‌ను ఆళ్లగడ్డ మండలం చింతకొమ్మదిన్నె గ్రామానికి చెందిన మాబాషా అనే బైక్ మెకానిక్‌కు ఇచ్చి వివాహం చేశారు. ఆయన తబసుమ్ విద్యాకాంక్షను గుర్తించాడు. భార్యను చదివించడానికి ఉర్దూ కళాశాలల గురించి తెలిసిన వారందరినీ ఆరాతీశారు. కర్నూలు తప్ప మరెక్కడా ఉర్దూ కళాశాల లేదని చెప్పడంతో చేసేదేమి లేక ప్రయత్నం విరమించాడు. 2010 నుంచి 2023 వరకు స్వగ్రామంలోనే ఆ దంపతులు ఉండిపోయారు. వారికి ఐదుగురు పిల్లలు కలిగారు. కుటుంబ ఆర్థిక పరిస్థితి మరింత దిగజారింది. అయినా మాబాషా తన భార్యను ఎలాగైనా చదివించి ఆమె ఆశయాన్ని నెరవేర్చాలనే సంకల్పంతో తెలిసిన వారందరినీ ఆరాతీస్తూనే ఉన్నాడు. ఓ రోజు నంద్యాలలో ప్రభుత్వ ఉర్దూ జూనియర్ కళాశాలను నెలకొల్పారనే సమాచారం చెవిన పడింది.

భార్య చదువు కోసం..

తబసుమ్ 2023లో నంద్యాలలోని ఉర్దూ కళాశాలలో అడ్మిషన్ పొందడానికి మూడేళ్ల పిల్లాడితో కళాశాలకు వెళ్లింది. అక్కడున్న వారందరూ వ్యంగంగా చూశారు. కానీ ఆమె అవేమి పట్టించు కోలేదు. ప్రిన్సిపాల్ కరీముల్లా వద్దకు వెళ్లి అడ్మిషన్ ఇవ్వాలని పట్టుబట్టింది.. ప్రిన్సిపాల్ ఆర్ఐవో దృష్టికి తీసుకెళ్లి ప్రత్యేకంగా ఆమెకు హెచ్ఎంసీ (ఉర్దూ) అడ్మిషన్‌ను ఇచ్చేలా చర్యలు తీసుకున్నారు. దీంతో ఆమె సంతోషానికి అవధులు లేకుండాపోయాయి. చంటి పిల్లాడితో, కాలేజీ బ్యాగుతో ఆళ్లగడ్డ నుంచి నంద్యాలకు బస్సులో ఆమె కళాశాలకు వెళ్లడం చూసి కొందరు అవమానకరంగా మాట్లాడారు. ఈ వయసులో నీకు చదువెందుకు అని హేళన చేశారు. కళాశాలలో చేరిన రోజు చంటి పిల్లాడిని చూసి అధ్యాపకులు ఆశ్చర్యపోయారు. కాని ఆమె పట్టుదలను చూసి చలించి పిల్లాడిని వెంట తెచ్చుకోవడానికి అనుమతినిచ్చారు. అలా రెండు నెలలు గడిచాయి. భార్య పడుతున్న కష్టాలను చూసి మాబాషా తన స్వగ్రామం నుంచి మెకానికల్ సామగ్రితో సహా నంద్యాలకు చేరుకున్నాడు. అప్పుడు బంధువులు, తల్లిదండ్రులు ఎన్నో అభ్యంతరాలు వెలిబుచ్చారు. అయినా ఆయన పట్టుసడలలేదు. నంద్యాల పట్టణం ఎన్జీవోస్ కాలనీకి చేరుకొని ఒక చిన్న ఇంటిని అద్దెకు తీసుకున్నాడు. ఇంటర్ మొదటి సంవత్సరంలో తబసుమ్ 500కు 438 మార్కులు సాధించి కళాశాల టాపర్‌గా నిలిచింది. ప్రతి ఒక్కరూ ఆశ్చర్యపోయారు. ఇటీవల విడుదలైన ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో కూడా 1000కి 876 మార్కులు సాధించి ఉర్దూ కాలేజీల్లో జిల్లా టాపర్‌గా నిలిచింది.



ఐఏఎస్ చదవాలని ఉంది.. స్థోమత లేదు

చిన్నప్పటి నుంచి నాకు ఐఏఎస్ కావాలనే తపన ఉండేది. కానీ 10వ తరగతిలో చదువు ఆగిపోయింది. నా భర్త, ఉర్దూ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు సహకరించడంతో ఇంటర్‌లో మంచి మార్కులు సాధించాను. రెండు సంవత్సరాల పాటు పిల్లాడిని తీసుకుని వెళ్లి ఉదయం నుంచి సాయంత్రం వరకు కళాశాలలోనే ఉండేదాన్ని. నేను ప్రతిరోజు తెల్లవారుజామున 3గంటలకు లేచి 5 గంటల వరకు చదువుకొనేదాన్ని. తర్వాత నమాజు చేసుకుని పిల్లలను రెడీ చేసి స్కూలుల్లో వదిలేసేదాన్ని. 9గంటలకంతా చిన్న పిల్లాడిని చంకనేసుకుని కాలేజీకి వెళ్లేదాన్ని. సాయంత్రం ఐదు గంటలకు ఇంటికి వచ్చి ఏడు వరకు పిల్లలకు ట్యూషన్ చెప్పేదాన్ని. తర్వాత 9 నుంచి 11 వరకు మరోసారి చదువుకుని ఆ తర్వాత నిద్రపోయేదాన్ని. టీటీసీ చేసి, ఆ తర్వాత డిగ్రీ చేసి ఏదైనా ఉద్యోగం చేస్తూ ఐఏఎస్ కావాలనే ఆశయ సాధన కోసం నిరంతరం కృషిచేస్తాను.

- తబసుమ్



ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నాను

నా భార్య తబసుమ్‌కు చదవాలనే సంకల్పం గట్టిగా ఉండేది. ఎప్పుడు ఏది కావాలని అడిగినా చదివించమని కోరేది. కాని చుట్టు పక్కల ఉర్దూ కళాశాల లేకపోవడంతో 12 ఏళ్ల పాటు ఏమీ చేయలేకపోయాను. 2023లో ఆళ్లగడ్డ నుంచి కళాశాలకు వెళుతుంటే ప్రతి ఒక్కరూ నన్ను అనేక విధాలుగా అవమానించారు. బంధువులు, చుట్టుపక్కల వారు అవహేళన చేశారు. వారందరికీ బుద్ధి చెప్పేందుకు ఎన్ని కష్టాలనైనా ఎదుర్కొని పిల్లలతో పాటు నా భార్యను కూడా చదివించాను. నేను చదువుకోలేదు. వారిలో చదువును చూసుకుంటున్నాను.

-మాబాషా



ఆర్ఐవోతో పర్మిషన్ తీసుకుని అడ్మిషన్ ఇచ్చాం

తబసుమ్ పట్టువదలకుండా అడ్మిషన్ కావాలని అడగడంతో ఇంటర్‌లో అడ్మిషన్ ఇచ్చేందుకు ఆర్ఐవో మాట్లాడి ప్రత్యేక పర్మిషన్ తీసుకున్నాం. ఇంతటి ఊహించిన ఫలితాలను సాధిస్తుందని అనుకోలేదు. ఉర్దూ మీడియం విద్యార్థులకు ఇంగ్లీష్‌లో సాధారణంగా తక్కువ మార్కులు వస్తుంటాయి. కాని తబసుమ్‌కు రెండు సంవత్సరాల్లో 75, 80 శాతం మార్కులు వచ్చాయి. ఆర్థికంగా చేయూతనిస్తే ఆమె అనుకున్న ఆశయాన్ని తప్పకుండా సాధిస్తుంది.- కరీముల్లా, ప్రిన్సిపాల్, ప్రభుత్వ ఉర్దూ జూనియర్ కళాశాల

పనులు త్వరితగతిన పూర్తిచేయాలి

- గుంటూరు డీఆర్ఎం సుధేష్ణసేన్
- నంద్యాల రైల్వేస్టేషన్ తనిఖీ



నంద్యాల రైల్వే స్టేషన్ ఆవరణలో జరుగుతున్న పనులను పరిశీలిస్తున్న గుంటూరు డీఆర్ఎం సుధేష్ణసేన్

నంద్యాల నూనెపల్లె, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): అమృత్‌భారత్ స్టేషన్స్ స్కీంకు ఎంపికైన నంద్యాల రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తిచేయాలని గుంటూరు డివిజన్ రైల్వేమేనేజర్ సుధేష్ణసేన్ ఆదేశించారు. ఇటీవలే నూతనంగా డీఆర్ఎంగా బాధ్యతలు చేపట్టిన ఆమె అమృత్‌భారత్ స్టేషన్స్ పనులు ఏవిధంగా జరుగుతున్నాయో పరిశీలించేందుకు ఆమె సోమవారం గుంటూరు నుంచి బయల్దేరారు. మార్గమధ్యలో సాతులూరు, నరసరావుపేట, దొనకొండ, మార్కాపురం రైల్వే స్టేషన్ల పరిశీలన అనంతరం నంద్యాలకు చేరుకున్నారు. నంద్యాల రైల్వేస్టేషన్‌లోని రన్నింగ్‌రూమ్‌ను పరిశీలించి ఆవరణలో మొక్కలు నాటారు. రన్నింగ్‌రూమ్ వెనుకవైపు నిర్మాణంలో ఉన్న ఆఫీసర్స్ గెస్ట్‌హౌస్ పనులను పరిశీలించారు. అక్కడినుంచి అంబేడ్కర్ భవన్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. రైల్వే స్టేషన్ ఆవరణలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను పరిశీలించారు. పనులకు సంబంధించిన మ్యాప్‌ను సంబంధిత సీనియర్ సెక్షన్ ఇంజనీర్లను అడిగితెలుసుకున్నారు. గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో నంద్యాల రైల్వేస్టేషన్‌కు ఎంతో ప్రాధాన్యత ఉండటంతో అభివృద్ధి పనుల్లో ఎలాంటి రాజీలేకుండా సూచించిన సమయానికి పనులను పూర్తిచేసి సేవలను ప్రయాణికులకు అందించాలని చెప్పారు. డీఆర్ఎం రాకతో సీపీఎం నాయకులు ఆమెను కలిసి వినతిపత్రం అందజేశారు. రైల్వే స్టేషన్ అభివృద్ధి పనుల్లో భాగంగా స్టేషన్ ఎదురుగా ఉన్న వ్యాపార సముదాయాలను తొలగించడంతో వారికి ప్రత్యామ్నాయ జీవనోపాధి కల్పించాలని కోరారు. ఆ ఆవరణలో కమర్షియల్ కాంప్లెక్స్‌ల నిర్మాణం ఉంటుందని తదనంతరం సమస్య పరిష్కారానికి కృషిచేస్తామని ఆమె చెప్పారు. నంద్యాల నూనెపల్లె ఓవర్‌బ్రిడ్జి కింద ట్రాక్ దాటకుండా కడ్డీలు ఏర్పాటుచేశారని వాటిని తొలగిస్తే అవతలివైపు ఉన్న జాతీయ రహదారికి చేరుకునేందుకు మార్గం సుగమం అవుతుందని ఆమె దృష్టికి తీసుకొచ్చారు. అర్ధరాత్రి మందుబాబులు, అనుమానాస్పదవ్యక్తులు సంచరిస్తున్నారని, రాత్రిపూట విధులు నిర్వహించే రైల్వే సిబ్బందిపై దాడులకు పాల్పడుతుండటంతో కడ్డీలు వేశామన్నారు. అండర్‌పాస్ బ్రిడ్జి నిర్మాణం కూడా పరిశీలనలో ఉందని ఆమె తెలిపారు. డీఆర్ఎం వెంట గుంటూరు రైల్వే డివిజన్ అధికారులు, నంద్యాల రైల్వే స్టేషన్ మేనేజర్ చంద్రశేఖర్, పలు విభాగాల అధికారులు, ఇంజనీర్లు ఉన్నారు.

ఇసుక తరలింపుపై నిఘా పెట్టాం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

హాలహర్వి, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఇసుక అక్రమ రవాణా జరగకుండా నిఘా పెట్టామని తహసీల్దార్ నజ్మాభాను సోమవారం తెలిపారు. ఆదివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'ఇసుక తోడేళ్లు' కథనానికి ఆమె స్పందించారు. సిద్దాపురం, జెహోసల్లి, గూళ్యం గ్రామాల్లో గ్రామ సేవకులను వేదవతి నది వద్ద కాపలా ఉంచామని, చర్యలు తీసుకోవాలని పోలీసులకు సూచించినట్లు వెల్లడించారు.

పేదల పెన్నిధి ఎన్టీఆర్


ఎన్టీఆర్ విగ్రహానికి భూమి పూజ చేస్తున్న నాయకులు

మద్దికెర, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): దివంగత ఎన్టీఆర్ పేదల పెన్నిధి అని, బడుగు బలహీన వర్గాల కోసం టీడీపీ ఆవిర్భవించిందని పంచాయతీ సలహాదారుడు నంది జయరాజులు, మాజీ సర్పంచ్‌లు ఆకుల ఆనంద్, మాబుసాబ్, నాయకుడు అడివప్ప అన్నారు. సోమవారం ఎడవలి గ్రామంలో ఎన్టీఆర్ విగ్రహానికి భూమి పూజ చేశారు. పార్టీ ఆవిర్భావం నుంచి పేదల కోసం కూడు, గుడ్డ నినాదంతో ముందుకు సాగుతోందన్నారు. పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు నేతృత్వంలో గ్రామంలో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

ఎస్సీ రుణాలకు దరఖాస్తు చేసుకోండి

దేవనకొండ, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాల మంజూరుకు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో సూర్యనారాయణ సూచించారు. ఈ నెల 14 నుంచి మే 10 వరకు అన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 32 రకాల వ్యాపారాలపై 40 నుంచి 60 శాతం సబ్సిడీ రుణం మంజూరవుతుందన్నారు.

కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి


కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

వెల్దుర్తి, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): వెల్దుర్తిలో వాగులు, వంకలు కబ్జాచేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం వెల్దుర్తికి వచ్చిన కలెక్టర్ రంజిత్‌బాషాకు మండల కార్యదర్శి కృష్ణ వినతిపత్రం అందజేశారు. నాగులవాగు వంకపై అక్రమంగా రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని, ఎర్రచెరువులో అనుమతులు లేకుండా మట్టిని తరలిసున్నారని అలాగే అక్రమంగా బియ్యాన్ని తరలిస్తున్నారని చర్యలు తీసుకోవాలని కోరారు. వెల్దుర్తిలో డిగ్రీ కళాశాల ఏర్పాటుచేయాలని, 14వ వార్డులో సీసీరోడ్లు, కాలువలు నిర్మించాలని తెలిపారు. చిరు వ్యాపారులకు సుంకం రద్దుచేయాలని సంఘం నాయకుడు రామాంజనేయులు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో కృష్ణ, గిరిబాబు, అనిల్, వెంకటేశ్వర్లు, చిలిపికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి కోసమే గ్రామ సభ

హొళగుంద, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి కోసమే గ్రామసభ నిర్వహిస్తున్నట్లు మేజర్ పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ అన్నారు. సోమవానం సర్పంచ్ చాలువాది రంగమ్మ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. గ్రామ అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. ప్రజల అర్జీలను సకాలంలో పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. అంతకు ముందు అంబేడ్కర్ చిత్రపటానికి నివాళి అర్పించారు. ఈవోఆర్డీ చక్రవర్తి, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థులతో చెలగాటం సరికాదు

ఆదోని టౌన్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): పరీక్ష రాస్తున్న విద్యార్థినితో చెలగాటం సరికాదని రజక కార్పొరేషన్ చైర్ పర్సన్ సావిత్రి అన్నారు. కృష్ణా జిల్లాలో రావివారి పాలెంకు చెందిన ప్రసన్న సాయి అనే పదో తరగతి విద్యార్థిని సోమవారం తల్లితండ్రులతో కలిసి ఆదోనిలో చైర్ పర్సన్‌ను కలిసి తనకు జరిగిన అన్యాయం గురించి చెప్పి విలపిం చారు. గత నెల 26న ఫిజికల్ సైన్స్ పరీక్షలో తాను పరీక్ష రాస్తుం డగా ఒక జవాబును మాధవీలత అనే ఇన్విజిలెటర్ బలవంతంగా తనతోనే కొట్టివేయించిని, అధికారులు, విద్యా శాఖ డైరెక్టర్, ప్రిన్సిపల్ సెక్రటరీకి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆవేదన వెలిబుచ్చారు. స్పందించిన చైర్ పర్సన్ దర్యాప్తు చేసి, న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు.


సావిత్రితో విద్యార్థిని, తల్లిదండ్రులు

సారా రహిత జిల్లాయే లక్ష్యం


ఊటను ధ్వంసం చేస్తున్న సిబ్బంది

ఆదోని, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): సారా రహిత జిల్లాగా చేయడమే లక్ష్యమని, 2016లో టీడీపీ ప్రభుత్వం నవోద యం, తీసుకొచ్చిందని ఎక్సైజ్ సీఐ సైదుల్లా తెలిపారు. సోమవారం మీడి యాతో మాట్లాడారు. కరోనా కారణంగా మద్యం అందుబాటులో లేకపో వడంతో జిల్లాలో తయారీ, అమ్మకాలు సాగాయన్నారు. వీటిని అరికట్టేందుకు కూటమి ప్రభుత్వం నవోదయం-2ను ప్రారంభించిం దన్నారు. సోమవారం ఎల్లమ్మ కొండల్లోని సారా స్థావరాలపై దాడులు చేసి, 365 లీటర్ల బెల్లం ఉటను ధ్వంసం చేసి 12లీటర్ల సారాను స్వాధీనం చూసుకున్నట్లు తెలిపారు. వాల్మీకి నగర్‌కు చెందిన బోయ మురళి తయారుచేశాడని, ఎమ్‌జీ కాలనీకి చెందిన ఓబులేసు అనే వ్యాపారి బెల్లాన్ని విక్రయించినట్లు తేలడంతో వీరిపై కేసునమోదు చేసినట్లు సీఐ సైదుల్లా తెలిపారు

పశుగ్రాసం విరాళం

తుగ్గలి, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాంపల్లెకు చెందిన యాపమాను లక్ష్మీకాంతరెడ్డి రూ.50వేలు విలువ చేసే రెండు ట్రాక్టర్ల పశుగ్రాసాన్ని కాశిరెడ్డి నాయన ఆశ్రమంలోని గోవులకు విరాళంగా అందించారు. పద్మనాభరెడ్డి, గురుదాస్ రెడ్డి, దూదేకొండ సుదాకర్, మహేంద్ర జగన్ తదితరులు ఉన్నారు.

అంబేడ్కర్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి

- కలెక్టర్ రంజిత్ బాషా
- నియోజకవర్గాల్లో అంబేడ్కర్ జయంతి


వెల్దుర్తి ఎస్సీ హాస్టల్‌లో నివాళి అర్పిస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా


కార్యాలయంలో నివాళి అర్పిస్తున్న సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్


ఆదోనిలో నివాళి అర్పిస్తున్న టీడీపీ ఇన్‌చార్జి మీనాక్షినాయుడు, ఉమాపతి నాయుడు

వెల్దుర్తి, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని, విద్యార్థులు ఉన్నతస్థాయికి చేరుకోవాలని కలెక్టర్ రంజిత్‌బాషా సూచించారు. సోమవారం వెల్దుర్తి ఎస్సీ హాస్టల్‌లో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళి అర్పించారు. అంబేడ్కర్ 1891 ఏప్రిల్ 14న జన్మించారని, ఆనాడు అంటరానితనం ఎక్కువగా ఉండేదన్నారు. పాఠశాలలో సామాజిక వివక్ష ఎదుర్కొన్నారని, ఉన్నత చదువు అనంతరం అస్పృశ్యత, అంటరానితనం రూపుమాపాలని అందరూ సమానంగా ఉండాలి అనే నినాదంతో పోరాటం మొదలు పెట్టారన్నారు. ప్రభుత్వం ఎస్సీ వసతిగృహాల మరమ్మతులకు రూ.7కోట్లు, బీసీ వసతి గృహాలకు రూ.1.5కోట్లు మంజూరు చేసిందన్నారు. విద్యార్థులకు బహుమతుల ను ప్రదానం చేశారు. అనంతరం వార్డెన్ ఉస్మాన్‌తో కలిసి వసతిగృహం స్టోర్ రూమ్, తరగతి గదులు, వంటశాలను తనిఖీచేశారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పూర్వ విద్యార్థులైన అనంతపురం రూరల్ సీఐ శేఖర్, ఎస్‌బీఐ ఉద్యోగి ప్రతాప్ అనుభవాలను విద్యార్థులకు తెలియజేశారు. వీరిని కలెక్టర్ సన్మానించారు. జేడీ రంగలక్ష్మీదేవి, ఏఎస్‌డబ్ల్యూవో లీలావతి, ఆర్డీవో సందీప్‌కుమార్, జడ్పీటీసీ సుంకన్న, ఎమ్మార్వో చంద్రశేఖర వర్మ, ఎంఈవో-2 రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ సేవలు మరువలేనివి: సబ్ కలెక్టర్

ఆదోని: భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ సేవలు మరువలేనివని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ అన్నారు. సోమవారం అంబేడ్కర్ జయంతి సంద ర్భంగా కార్యాలయంలో నివాళి అర్పించారు. అణగారిన వర్గాల సంక్షేమానికి అంబేడ్కర్ చేసిన కృషిని మరువలేనిదని, దూర దృష్టితో దేశ భవిష్యత్తును ఊహించి, రాజ్యాంగాన్ని రూపొందించారన్నారు. మైనార్టీ వెల్ఫేర్ అధికారి సబిహ పర్వీన్, తహసీల్దార్ శివరాముడు, డీటీ వలిబాషా, డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణు సూర్య, సీనియర్ సహాయకులు రామచంద్ర, ఖాసిం, డీఏవో లక్ష్మీజి పాల్గొన్నారు.

● పట్టణంలోని టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు, నాయకుడు ఉమాపతి నాయుడు నివాళి అర్పించారు. రామస్వామి, సాధికా బేగం, వీరేష్, మల్లికార్జున పాల్గొన్నారు.

ఆదోని టౌన్: బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి ఆదూరి విజయకృష్ణ, వాల్మీకి సాయి ప్రసాద్ రక్తదానం చేశారు. మహదేవ, మల్లిక, రత్నాబాయి, అజయ్ కుమార్, సాయి, శివ, శ్రీకాంత్, తాయన్న పాల్గొన్నారు.




ఆలూరులో నివాళి అర్పించిన టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్, ఎమ్మెల్యే విరుపాక్షి, ఆర్గనైజింగ్ కార్యదర్శి వైకుంఠం ప్రసాద్


దేవనకొండలో కప్పట్రాళ్ల బొజ్జమ్మ

బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు నీలకంఠ నివాళి అర్పించారు. ఎండి బసవరాజస్వామి, కుమారస్వామి, కృష్ణ మురళీధర్ గౌడ్, సాయినాథ్, బాలకృష్ణ, మద్దిలేటి, దాదాభాష పాల్గొన్నారు. ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సత్యవతి ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. టీబీ యూనిట్‌కు సంబంధించిన ఎంపీహెచ్‌ఎస్ బాబురాజు, ఎస్‌వీవో మంజునాథ్, దోరతి, మేరీ, జ్ఞానేశ్వరి, లలితమ్మ, మధు, సుబ్బమ్మ బాయి పాల్గొన్నారు.

హొళగుంద: తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మార్పీఎస్ నాయకులు చిన్న హ్యాట శేషగిరి, సీహెచ్ నాగరాజు, కన్నారావు, చిదా నంద, నివాళి అర్పించారు.

హాలహర్వి: టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర, హాలహర్వి గ్రామ సర్పంచ్ మల్లికార్జున ఆధ్వర్యంలో జయంతి నిర్వహించారు. కన్వీనర్ సుధాకర్, కర్ణాటక రాష్ట్రం మాల మహానాడు రాష్ట్ర నాయకులు నర్సప్ప, బీజేపీ నాయకులు బసవరాజు, ప్రహల్లాద రెడ్డి పాల్గొన్నారు.

పత్తికొండ: టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు సాంబశివారెడ్డి, ఎస్సీసెల్ నాయకుడు చందోలి తిరుపాల్ పత్తికొండలో నిర్వహించారు. ప్రమోద్ కుమార్‌రెడ్డి, రామానా యుడు, సురేష్ కుమార్, చల్లారవి, తిమ్మయ్య చౌదరి, కడవలసుధాకర్, బిటీగోవిందు, పుందుకూర బ్రహ్మయ్య, శ్రీనివాసులు గౌడ్ ఉన్నారు.

పత్తికొండ టౌన్: పట్టణంలో అంబేడ్కర్‌కు మాజీ ఎమ్మెల్యే కే.శ్రీదేవి, నాయకులు నాగరత్నమ్మ, శ్రీరంగ డు, ఎంపీపీ నారాయణదాస్ నివాళి అర్పించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య, డీహెచ్‌పీఎస్ రాష్ట్ర నాయకులు గురుదాస్, పార్టీ నాయకులు నబీ రసూల్, సురేంద్ర, రామాంజనేయులు నివాళి అర్పించారు.

ఆలూరు: టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్ అంబేడ్కర్ విగ్రహానికి, టీడీపీ కార్యాలయంలో చిత్రపటానికి నివాళి అర్పించారు. నరసప్ప, కొమ్ము రామాంజినేయు లు, బాలరాజు, ముద్దు రంగ, మసాలా జగన్, గూళ్యం రామాంజీ, ఈరన్న, రాము, అంజి, రమేష్ పాల్గొన్నారు.

● టీడీపీ ఆర్గనైజింగ్ కార్యదర్శి వైకుంఠం ప్రసాద్, జ్యోతి ఆధ్వర్యంలో బైక్‌ర్యాలీ నిర్వహించి, నివాళి అర్పి ంచారు. జనసేన నాయకుడు రంజిత్, మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్లు, ప్రకాశ్, సీనప్ప, విశ్వ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే విరుపాక్షి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. కన్వీ నర్ మల్లికార్జున, భాస్కర్ నాయుడు, అరికెర వీరేష్, రాజు పాల్గొన్నారు.

●ఎమ్మార్పీఎస్ రాయలసీమ జిల్లా అధ్యక్షులు చిప్పగిరి లక్ష్మీ, నారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడు ముత్యాల గాదిలింగ, బాలరాజు ఉన్నారు. మాదిగ ఉద్యోగుల సంఘం తాలూకా అధ్యక్షుడు బసవరాజు, రాజన్న, మహాదేవమ్మ, రిటైర్డ్ హెచ్‌ఎం వీరస్వామి, బీఎస్‌పీ ఇంన్‌చార్జి రామలింగ ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి వేడుకలు నిర్వహించారు.

దేవనకొండ: స్థానిక బస్టాండ్ ఆవరణలో అంబేడ్కర్ విగ్రహానికి వాల్మీకి కార్పొరేషన్ చైర్‌పర్సన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ, మాజీ ఎంపీపీ రామచంద్రనాయుడు, టీడీపీ కన్వీనర్ విజయభాస్కర్‌గౌడ్, డీవీఎంసీ సభ్యులు శాంతికుమార్ నివాళి అర్పించారు. అలాగే మండలం లోని తెర్నేకల్, పి.కోటకొండ, నేలతలమర్రి, దేవనకొండ గ్రామాల్లో పలువురు నాయకులు నివాళి అర్పించారు.

మద్దికెర: పెరవలి గ్రామం ఎస్సీ కాలనీలో పత్తికొండ సీఐ పులిశేఖర్ గౌడ్ నివాళి అర్పించారు. పంచాయతీ, ఎంపీడీవో కార్యాలయాల్లో నివాళి అర్పించారు. ప్రత్యేక అధికారి ఉమాదేవి, ఎంఈవో రంగస్వామి, హౌసింగ్ ఏఈ ఉమాకాంత్; ఏవో రవి, కార్యదర్శి శివకుమార్, ఎంపీపీ అనిత, సర్పంచ్ సుహాసిని పాల్గొన్నారు.

తుగ్గలి: తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలు, జొన్నగిరి, ఎర్రగుడిలో ఎస్సీ బాలుర సంక్షేమ హాస్టల్‌లో అంబేడ్కర్‌కు నివాళి అర్పించారు. కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ప్రత్యేకాధికారి సుధాకర్, ఎంపీపీ రామాంజనమ్మ, జడ్పీటీసీ పులికొండ నాయక్, వార్డెన్ రమేష్, సర్పంచ్ ఓబులేసు, విద్యాకమిటి చైర్మన్ రవియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

చిప్పగిరి: అంబేడ్కర్‌కు టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్, ఎమ్మార్పీఎస్ నాయకుడు చిన్నగిరి లక్ష్మీనారా యణ నివాళి అర్పించారు. చిప్పగిరి, రామదుర్గం, నగరడోన గ్రామాల్లో పాలొన్నారు. రామదుర్గం సర్పంచ్ రోహిణి ఆధ్వర్యంలో రూ.5లక్షలతో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు.

ఆదోని అగ్రికల్చర్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): శ్రీనివాస భవన్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి ఎస్టీయూ నాయకులు ప్రహల్లాద, వీరచంద్ర యాదవ్, రవి, భీమరాజు, రాజా, సతీష్, ఉరుకుందప్ప నివాళి అర్పిం చారు. మిల్టన్ పాఠశాలలో కరస్పాండెంట్ రమేష్ బాబు, ప్రిన్సిపాల్ నాగరాజు, ఎస్టీయూ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ఆలూరు ఎంఈవో చిరంజీవి రెడ్డి, హెచ్‌ఎం వెంకటస్వామి, నాగేంద్రప్ప నరసింహులు నివాళి అర్పించారు. బీసీ ఫెడరేషన్ ఉపాధ్యక్షుడు దస్తగిరి నాయుడు, దేవి శెట్టి ప్రకాష్, విశ్రాంత తహసీల్దార్ షేక్షావలి, నల్లారెడ్డి నివాళి అర్పించారు. విద్యుత్ కార్యాలయంలో డీఈ పురుషో త్తం, ఏఈలు నాగభూషణం, ఉలిగప్ప, చెన్నయ్య నివా ళులర్పించారు. ఏబీవీపీ నాయకులు వీరేష్, గోవింద రాజు, వెంకటేరమణ, ఉమేష్ నివాళులర్పించారు.

ఆదోని టౌన్: బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ నివాళి అర్పించారు. రజక కార్పొరేషన్ చైర్పర్సన్ సావిత్రి, విట్టా రమేష్, ఉపేంద్ర కుమార్, శ్రీరా ములు, నాగరాజు గౌడ్ పాల్గొన్నారు.

వెల్దుర్తి: టీడీపీ నాయకుడు సుబ్బరాయుడు, కన్వీనర్ బలరాంగౌడ్, సుధాకర్‌గౌడ్, బజారు నివాళి అర్పిం చారు. ప్రభుత్వ ఆసుపత్రిలో మాల మహానాడు అధ్యక్షుడు లింగం శ్రీనివాసులు, సూపరిండెం ట్ బాల చంద్రారెడ్డి పాలు, పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు


చిప్పగిరి: రామదుర్గంలో నివాళి


పత్తికొండలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి


ఆదోనిలో ఎస్టీయూ నాయకుల నివాళి


పత్తికొండలో నివాళి అర్పిస్తున్న టీడీపీ నాయకులు

గోవులపై అసత్య ప్రచారాలు చేయొద్దు


మాట్లాడుతున్న వీరభద్ర గౌడ్

ఆలూరు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): టీటీడీలో గోవుల మరణాలపై టీడీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి అసత్య ఆరోపణలు చేయొద్దని టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్ కోరారు. సోమవారం పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ అనారోగ్యం, వయసు అయిపోవడంతో గోవులు మృతి చెందడం సహజమే అన్నారు. గతంలోనూ టీటీడీపై విమర్శలు చేసిన భూమన, ఇప్పుడు టీడీపీ ప్రభుత్వంపై దుష్ప్రచారం చేయడం సరి కాదన్నారు. ఇలాంటి చౌకబారు ప్రకటనలు చేస్తే భారీ మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు.

భీమ లింగేశ్వర స్వామి రథోత్సవం


బెల్డోనలో రథోత్సవం

చిప్పగిరి, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బెల్డోన గ్రామం భీమ లింగేశ్వర స్వామి రథోత్సవం సోమవారం నిర్వహించారు. వేద పండితులు రామనాథశాస్త్రి పూజలు చేశారు. అనంతరం భక్తులు రథాన్ని లాగారు. కోలాటాలు, బొమ్మలాట, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఎస్ఐ సతీష్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. సర్పంచ్ కరివేముల సావిత్రి, నిర్వాహకులు మాజీ సర్పంచ్ భీమ లింగప్ప, వెంకప్ప, మన్నే గోవిందన్న, హనుమేష్, రాయల బీమలింగప్ప, టీడీపీ నాయకులు కె వెంకటేష్, అనిల్ కుమార్, కె గోవిందు, కమ్మ శ్రీనివాసులు పాల్గొన్నారు.

అగ్నిమాపక వారోత్సవాలు ప్రారంభం

పత్తికొండ, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): అగ్నిమాపక కేంద్రంలో అగ్నిమాపక వారోత్సవాలను సోమవారం సీఐ జయన్న ప్రారంభించారు. ఫైర్ ఆఫీసర్ దినకర్‌బాబు అంబేడ్కర్‌కు నివాళి అర్పించారు. అనం తరం సీఐ మాట్లాడుతూ అగ్నిప్రమాదాలు సంభవించిన సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. దినకర్‌బాబు మాట్లాడుతూ 14 నుంచి 20వ తేదీ వరకు అగ్నిమాపక వారోత్సవాలు ఉంటాయ న్నారు. వెంకటేశ్వర్‌రెడ్డి ఉన్నారు.

పశుగ్రాసం దగ్ధం

చిప్పగిరి, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామదుర్గం గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి దాటాక రూ.6 లక్షల విలువచేసే పశుగాసం దగ్ధమయింది. అర్ధరాత్రి మంటలు చెలరేగి కాలిపోయా యని రైతులు మాచనూరు సోమన్న, మాచనూర్ విజయ్, మాచనూరు నాగార్జున, మాచచనూరు మౌలాలి ఆవేదన వ్యక్తం చేశారు. ఫైర్ ఇంజన్ వచ్చేలోపు కాలిపోయిందని తాహసీల్దార్ ఇయాజ్ అహ్మద్, వీఆర్‌వో మల్లికార్జున తెలిపారు.

గెలుపోటములను సమానంగా తీసుకోవాలి

మద్దికెర, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు గెలుపోటములను సమా నంగా తీసుకోవాలని వైసీపీ కార్యవర్గ సభ్యుడు జయభారత్ రెడ్డి, ఎంప్లాయిస్ అసోసియేషన్ సభ్యుడు నారాయణరావు అన్నారు. సోమవారం బురుజుల గ్రామం లో కబడ్డీ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

తాగునీటి సమస్య రాకుండా చూడాలి

మద్దికెర, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): వేసవిని దృష్టిలో ఉంచుకుని తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని ప్రత్యేకాధికారి ఉమాదేవి సూచించారు. సోమవారం ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, హౌసింగ్ ఏఈ, ఏవోతో మాట్లాడుతూ బురుజుల గ్రామంలో మండల నిధులతో బోరువేసి ప్రజల దాహార్తిని తీర్చాలన్నారు. హౌసింగ్‌ను ఆన్‌లైన్‌లో వేగవంతం చేయాలన్నారు. పక్కాగృహాలు లేని నిరుపేదలను గుర్తించి వారికి పక్కాగృహాలు అందేలాచూడాలన్నారు. పంట నష్టం వివారలను అడిగి తెలుసుకున్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మయాంక్, హౌసింగ్ ఏఈ ఉమాకాంత్; వ్యవసాయాశాఖ అధికారి రవి, ఎంపీపీ అనిత, సర్పంచ్ సుహాసిని ఉన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి ఉమాదేవి

కౌన్సిలర్లు డబ్బులకు అమ్ముడుపోయారు

- బీజేపీ నాయకుల వీధి సమావేశాలు


మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

ఆదోని టౌన్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): మునిసిపల్ చైర్ పర్సన్‌ను పదవి నుంచి దింపడానికి కౌన్సిలర్లు డబ్బులకు అమ్ముడుపోయారని అమరావతి నగర్ కౌన్సిలర్ వెల్లాల లలితమ్మ ఆరోపించారు. సోమవారం పట్టణంలోని తిమ్మారెడ్డి, బస్‌స్టాండ్, గణేష్ సర్కిల్ ప్రాంతాల్లో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి విజయ కృష్ణ అధ్యక్షతన జరిగిన వీధి సమావేశంలో మాట్లాడుతూ చైర్‌పర్సన్ శాంతపై వైసీపీ నాయకుల కుట్రను వివరిం చారు. అవినీతి లేని శాంతపై అవిశ్వాస తీర్మానం పెట్టడాన్ని ప్రజలు వ్యతిరేకిం చాలని పిలుపుఇచ్చారు. ఎమ్మెల్యే పార్థ సారధి మంజూరు చేయించిన రు.4కోట్ల నిధులతో అభివృద్ధి పనులు జరుగకుండా కౌన్సిలర్లు అడ్డుకోవడం ఎంతవరకు సమంజ సమో నిలదీయాలన్నారు. 16వ తేదీన ప్రజలు కౌన్సిలర్లను ప్రశ్నించడానికి మున్సిపల్ కార్యాలయానికి రావాలని కోరారు. మల్లిక, వాల్మీకి సాయి, మహదేవ్, రత్నా బాయ, అంజయ్ కుమార్, శివ, శ్రీకాంత్, తాయన్న పాల్గొన్నారు.

పోటీలు సంస్కృతికి అద్దం

మద్దికెర, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): రాతిదూలం పోటీలు పల్లె సంస్కృతికి అద్దం పడతాయని వైస్ ఎంపీపీ మహేశ్వరరెడ్డి, సర్పంచ్ బురుజుల విజయుడు అన్నారు. సోమవారం ఎం.అగ్రహారం గ్రామంలో జాతరను పురస్కరించుకుని ఎద్దుల రాతిదూలం పోటీలు ప్రారంభించారు. మొత్తం 12 జతల ఎద్దులు పాల్గొన్నాయి. గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు.

వక్ఫ్ సవరణ రద్దుకు పోరాడాలి

- రౌండ్ టేబుల్ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య


మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య

పత్తికొండ టౌన్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): బీజేపీ ప్రభుత్వం ముస్లింల మనోభావాలు దెబ్బతీసేలా వక్ఫ్‌బోర్డు బిల్లు సవరణ తీసుకువచ్చిందని, బిల్లు రద్దుకై పోరుకు సిద్ధం కావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య పిలుపునిచ్చారు. సోమవారం షాదీఖానాలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. అధికార మదంతో బీజేపీ ఆఘమేఘాల మీద పార్లమెంటులో వక్ఫ్‌బోర్డు బిల్లును పాస్ చేసి రాష్ట్రపతి ఆమోదముద్ర వేయించడం విచారకరమన్నారు. కేంద్ర ప్రభుత్వ వైఖరిపై వామపక్షాలు, ప్రజాస్వామ్యవాదులు, ముస్లిం సంఘాలు ఆందోళనలు పట్టించు కోవడం లేదని, రద్దు చేసే వరకు పోరాటాలు ఆగవని హెచ్చరించారు. సీపీఐ, సీపీఎం నాయకులు ఇబ్రహీం, నబీరసూల్, వెంకటేశ్వరరెడ్డి, రామాంజనేయులు, జామియామసీదు కమిటీ సభ్యులు హుశేన్, బషీర్ బాషా, కొత్తపేట సభ్యులు హోసూరు బాషా, నూర్‌బాషా, గుండుబాషా, అల్తాఫ్, తదితరులు పాల్గొన్నారు.

'స్థానిక' ఎన్నికలకు సిద్ధం కావాలి



సమావేశంలో పాల్గొన్న అబ్జర్వర్ దేవళ్ల మురళి, నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి

మంత్రాలయం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు సిద్ధం కావాలని మంత్రాలయం నియోజకవర్గ అబ్జర్వర్ వడ్డె దేవళ్ల మురళి, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి అన్నారు. సోమవారం మంత్రాలయం మండలంలోని మాధవరం గ్రామం ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి నివాసంలో నియోజకవర్గ పార్టీ సంస్థాగత కమిటీ ఏర్పాటు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని పిలుపునిచ్చారు. మినీ మహానాడు జరిగేలోపే మండల కమిటీలను ఎంపిక చేసే బాధ్యత నియోజకవర్గ ఇన్‌చార్జిలే బాధ్యతగా తీసుకోవాలన్నారు. మంత్రాలయం నియోజకవర్గంలో టీడీపీని బలోపేతం చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు. గ్రామం నుంచి మండల స్థాయి, డివిజన్ స్థాయి నియోజకవర్గ స్థాయిలో టీడీపీని సభ్యత్వం చేసిన విధంగానే ప్రతి కార్యకర్తకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. టీడీపీ నాయకులు ఉలిగయ్య, పల్లెపాడు ముత్తురెడ్డి, రామిరెడ్డి, ఎల్లెల్సీ చైర్మన్ టిప్పుసుల్తాన్, జిల్లా అధికార ప్రతినిధి చావిడి వెంకటేశ్, మాజీ జడ్పీటీసీ ఆర్.లక్ష్మయ్య, ఎస్ఎం గోపాల్ రెడ్డి, అశోక్ రెడ్డి, లక్ష్మన్న, బసలదొడ్డి ఈరన్న, వక్రాణి వెంకటేశ్, జ్ఞానేష్ తాయన్న, నర్సిరెడ్డి, సురేష్ నాయుడు, వీరేష్, అడివప్పగౌడు, వెంకటపతిరాజు, రామలింగ, హనుమంతు, విజయ్, అశోక్ రెడ్డి, వరదరాజు, రాజానందన్, హనుమంతరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకోవాలి

గోనెగండ్ల, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం సబ్సిడీ రుణాలకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో మణిమంజరి కోరారు. సోమవారం ఆమె మాట్లాడుతూ గోనెగండ్ల మండలంలోని ఎస్సీలు మాల, మాదిగ కులాలకు చెందిన లబ్ధిదారులు సబ్సిడీ రుణాల కోసం మే 10వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అర్హులైన లబ్ధిదారులకు బ్యాంక్ అనుసంధానంతో సబ్సిడీ రుణాలు ఇస్తామని తెలిపారు. ఈ రుణాల కోసం ఏపీఓబీఎంఎంఎస్ అను వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

మారెమ్మ దేవాలయ హుండీ చోరీ

మంత్రాలయం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పరమాన్‌దొడ్డి తండా గ్రామంలో వెలసిన మారెమ్మ దేవాలయంలోని హుండీని గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెల్లారు. ఈ సంఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకున్నది. సోమవారం ఉదయం గుడి పూజారి సుగాలి నాగరాజు నాయక్ ఆలయం తలుపులు తెరుస్తుండగా.. తాళం పగిలిపోయి గ్రిల్‌కు ఉన్న తాళం ధ్వంసం చేయడాన్ని గమనించారు. హుండీని ధ్వంసం చేసి అందులో ఉన్న నగదును అపహరించుకుని వెళ్లారని మాధవరం పోలీసులకు పూజారి ఫిర్యాదు చేశారు. పూజారి నాగరాజు నాయక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విజయకుమార్ తెలిపారు.

పంచలోహ నాగకిరీటం బహూకరణ



ఐదు పడగల నాగకిరీటాన్ని బహూకరించిన భక్తులు

మంత్రాలయం, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రపురంలో వెలసిన శ్రీఅభయాంజనేయస్వామి దేవాలయంలోని శివలింగానికి రాఘవేంద్రశెట్టి, కుటుంబ సభ్యులు పంచలోహ నాగకిరీటాన్ని విరాళంగా ఇచ్చారు. సోమవారం పంచలోహాలతో ఐదు పడగల నాగేంద్ర స్వరూపాన్ని శివలింగానికి అమర్చి ప్రత్యేక పూజలు చేసి హారతులు ఇచ్చారు. విరాళం ఇచ్చిన దాతల కుటుంబానికి పూజారి వంశీకృష్ణ, మధుసూదనాచార్ దాతలను శేషవస్త్రం కప్పి ఆశీస్సులు అందజేశారు. ప్రతి రోజు పూజలనంతరం శివలింగానికి నాగభరణం తొడిగి అలంకరించి పూజలు చేస్తామని పూజారులు వంశీకృష్ణాచార్ తెలిపారు.

చెత్త నుంచి సంపదను సృష్టించాలి



చెత్త నుంచి సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీపీవో భాస్కర్

గోనెగండ్ల, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛఆంధ్ర స్వచ్ఛ దివాస్ కింద చెత్త నుంచి సంపదను సృష్టించాలని జిల్లా లోని గ్రామ పంచాయతీ కార్యదర్శులను జిల్లా పంచాయతీ అధికారి భాస్కర్ కోరారు. సోమవారం మండల కేంద్రమైన గోనెగండ్లలోని చెత్తసంపద కేంద్రంను ఆయన పరిశీలించారు. రోజుకు ఎంత చెత్త సేకరిస్తున్నారు. సేకరించిన చెత్తతో ఎంత వరకు వర్మీకంపోస్టు తయారు చేస్తున్నారు. వర్మీ కంపోస్టును ఎలా తయారు చేస్తున్నారు. తయారు చేసిన కంపోస్టును ఎంత మేర అమ్మకాలు జరుపుతున్నారని ఈవోఆర్‌డీ అనంతశయన, పంచాయతీ కార్యదర్శి సతీస్ ను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలోని ప్రతి గ్రామంలో ప్రతి ఒక్కరు తమ వంతు సహకారం అందించాలని ఆయన కోరారు. ఆయా పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు గ్రామాల్లోని ఇంటింటికి వెళ్లి తడి చెత్త, పొడి చెత్తను సేకరించాలని ఆ రెండిటిని విడిగా చేసి వర్మి కంపోస్టు ఎరువున తయారు చేసి రైతులకు అమ్మకాలు జరపాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆబాదీ రీ సర్వేకు అందరు సహకరించాలి: వచ్చే నెలలో జిల్లా లోని ప్రతి గ్రామంలో పంచాయతీ ఆధ్వర్యంలో చేపట్టే ఆబాదీ రీ సర్వేకు ప్రజలు సహకరించాలని డీపీవో భాస్కర్ కోరారు. వచ్చే మే, జూన్ నెలలో ప్రతి గ్రామంలో ఈ పంచాయతీ అధికారుల ఆధ్వర్యంలో రీ సర్వే జరుగుతుందని ఈ సర్వేలో ప్రతి ఇంటి సరిహద్దులు కొలతలతో కూడిన డిజిటల్ పత్రంను సరిచేసి ఇంటి యజమానికి అందజేయబడుతుందని ఆయన తెలిపారు. ప్రతి ఒక్కరూ ఈ రీ సర్వేకు సహకరించాలని కోరారు.

ఘనంగా అంబేడ్కర్ జయంతి

● నివాళి అర్పించిన విద్యార్థి సంఘాల నాయకులు
● తలసేమియా పిల్లల కోసం రక్తదానం
● ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ర్యాలీలు, సభలు

రాజ్యాంగ నిర్మాత, భారత రత్న, బడుగు బలహీనవర్గాల ఆశాజ్యోతి డా.బీఆర్ అంబేడ్కర్ జయంతిని నియోజకవర్గాల వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటాలకు, విగ్రహాలకు అభిమానులు, నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ రాజ్యాంగాన్ని రచించి అంబేడ్కర్ భారతదేశానికి చేసిన సేవలు మరువలేనివని అన్నారు. ప్రతి ఒక్కరూ ఆయన అడుగుజాడల్లో నడవాలన్నారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. కొన్ని చోట్ల ఆస్పత్రుల్లో రోగులకు, అనాథ పిల్లలకు పండ్లు, బ్రేడ్లు పంపిణీ చేశారు.

ఎమ్మిగనూరు, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): పట్టణంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని రాజకీయపార్టీలు, ప్రజా సంఘాలు, దళితసంఘాలు, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు టీడీపీ పట్టణ నాయకుల ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. అలాగే వైసీపీ, బీజేపీ, కాంగ్రెస్, బీఎస్పీ పార్టీల నాయకులు ర్యాలీగా అంబేడ్కర్ విగ్రహం దగ్గరకు వచ్చి నివాళి అర్పించారు. అలాగే సీపీఐ,సీపీఎం, సీఐఎంఎల్ న్యూడెమెక్రసీ, ప్రతిఘటన పార్టీల కార్యాలయాల్లో అంబేడ్కర్ జయంతిని నిర్వహించారు. అలాగే అంబేడ్కర్ జయంతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఎంబీ చర్చి నుంచి డప్పులతో భారీర్యాలీ నిర్వహించి ఎంపీడీవో కార్యాలయం దగ్గర సభ నిర్వహించారు. అలాగే తలసేమియ పిల్లలకోసం రక్తదానం చేశారు. అలాగే జయంతి, వర్ధంతి ఉత్సవకమిటి జై భీం ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీగా అంబేడ్కర్ విగ్రహం దగ్గరకు చేరుకొని పూలమాల వేసి నివాళి అర్పించారు. ఏపీఎంఆర్‌పీఎస్, ఐఎఫ్‌టీయు, మాలమహానాడు ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. అలాగే బహుజన విద్యార్థి యూనియన్ ఆధ్వర్యంలో రోగులకు పాలు బ్రెడ్లు పంపిణీ చేశారు. పట్టణంలోని ఎస్సీ బాలికల హాస్టల్‌లో డీఆర్‌డీఏ పీడీ రమణారెడ్డి అంబేడ్కర్ జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. అలాగే అంబేడ్కర్ కాంస్య విగ్రహానికి ఆర్‌యూఎస్‌ఎఫ్, ఆర్‌పీఎస్‌ఎఫ్ నాయకులు రఘు, అఫ్రిది క్షీరాభిషేకం చేశారు. పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు.

కౌతాళం: స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో అంబేడ్కర్ విగ్రహానికి వివిధ పార్టీల నాయకులు, దళిత సంఘాల నేతలు పూలమాల వేసి నివాళులర్పించారు. టీడీపీ ఆధ్వర్యంలో పార్టీ టౌన్ అధ్యక్షుడు కాశీవిశ్వనాథ, రైతు సంఘం, జైభీమ్, దళిత సంఘాల, కేవీపీఎస్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు.

మంత్రాలయం: టీడీపీ, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జీలు రాఘవేంద్ర రెడ్డి, లక్ష్మన్న, వివిధ పార్టీ నాయకులు వేర్వేరుగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంబేడ్కర్ చిత్రపటాన్ని పంచ అశ్వవాహన రథంపై ఊరేగించారు. ఈ దృశ్యం ప్రజలను ఎంతగానో ఆకట్టుకుంది. మాధవరంలో కేవీపీఎస్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటాన్ని కోలాట నృత్యాలు, కర్రసాము, జానపద నృత్యం, డ్రమ్స్, తప్పెట్లు, డీజేలతో భారీ ఎత్తున ఊరేగించారు.

గోనెగండ్ల : మండల కేంద్రమైన గోనెగండ్లలో పంచాయతీ, తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయంతో పాటు పోలీస్‌స్టేషన్‌లో, మండలంలోని వివిధ కార్యాలయాల్లో అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి వేర్వేరుగా పూలమాలలు వేసి నివాళి అర్పించారు .కేవీపీఎస్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూల వేసి గ్రామంలోని వీదులో ర్యాలీ నిర్వహించారు. టీడీపీ కార్యాలయంలో ఆపార్టీ నాయకులు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. బస్టాండ్ ప్రాంగణంలో డప్పుకళాకారుల సంఘం నాయకులు కరుణాకర్, నందు కేక్ కట్ చేశారు.

ఎమ్మిగనూరు రూరల్: మండలంలోని గుడికల్లు, కందనాతి, ఏనుగుబాల, బనవాసి, కలుగొట్ల, కడివెళ్ల గ్రామాల్లో అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. తహసీల్దార్, ఎంపీడీవో, ప్రభుత్వ బాలికల కళాశాలలో అధికారులు అంబేడ్కర్‌కు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఎంపీపీ కేశన్న, ఎంపీడీవో బంగారమ్మ, వీఆర్వోలు ఈరన్న, మోహన్, షేక్షావలి, నాయకులు రంగన్న, దేవదాసు తదితరులు పాల్గొన్నారు.

పెద్దకడుబూరు: అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నరవ రమాకాంత్‌రెడ్డి అన్నారు. ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి టీడీపీ రైతు సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి, ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో యువరాజ్, సతీష్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమాల్లో మల్లికార్జున, బొగ్గుల తిక్కన్న, బొగ్గులబాష, సుధాకర్, పుల్లయ్య, శాంతిరాజు, యేసన్న, బొజ్జప్ప, ముగతి యేసన్న పాల్గొన్నారు.

నందవరం: మండల కేంద్రమైన నందవరంతో పాటు పలు గ్రామాల్లో అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. నందవరంలో టీడీపీ మండల నాయకులు గురురాజారావు, తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు శ్రీనివాసులు, ఎంపీడీవో కార్యాలయంలో ఈవోపీఆర్డీ సందీప్, పోలీస్‌స్టేషన్‌లో ఎఐ కేశవ్, పూలచింతలో, సర్పంచ్ అక్కామాంబదేవి, బండేగురుస్వామి అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కోసిగి: మండలంలోని అన్ని గ్రామాల్లో, ప్రభుత్వ ప్రైవేటు కార్యాలయాల్లో అంబేడ్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఈరన్న, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, సీపీఐ కార్యాలయంలో గోపాల్, పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ అయ్యమ్మ, సాతనూరు, అగసనూరు తదిరత గ్రామాలతో పాటు కోసిగిలో అంబేడ్కర్ ఉత్సవ్ కమిటీ ఆధ్వర్యంలో కోసిగి కడాపాలెం నుంచి నడిమిపాలెం, సిద్దప్ప పాలెం మీదుగా ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటాన్ని ట్రాక్టరులో ఏర్పాటు చేసి డీజే సౌండుతో ర్యాలీ చేపట్టారు. కోసిగి సీఐ మంజునాథ్, ఎస్ఐ హనుమంతరెడ్డి, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మనోజ్ కుమార్ హాజరయ్యారు.



మంత్రాలయంలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న టీడీపీ, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జిలు రాఘవేంద్రరెడ్డి, లక్ష్మన్న, జైభీమ్ ఎమ్మార్పీఎస్ నాయకులు



ఎమ్మిగనూరులో..



కోసిగిలో అంబేడ్కర్ జయంతి వేడుకలో మాట్లాడుతున్న సీఐ



కౌతాళంలో ..



నందవరంలో..



గోనెగండ్లలో..



పెద్దకడుబూరులో ..



మంత్రాలయంలో అంబేడ్కర్ చిత్రపటాన్ని ఊరేగిస్తున్న దళిత సంఘాల నాయకులు



సీపీఐ కార్యాలయంలో అంబేడ్కర్‌కు నివాళి అర్పిస్తున్న నాయకులు

సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న ఈవోఆర్డీ అనంతశయన

గోనెగండ్ల, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఈవోఆర్డీ అనంతశయన, గోనెగండ్ల మేజర్ పంచాయతీ సర్పంచ్ హైమావతి, కార్యదర్శి సతీష్ అన్నారు. సోమవారం మండల కేంద్రమైన గోనెగండ్లతో పాటు మండలంలోని పలు గ్రామాలలో పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవోఆర్‌డీ అనంతశయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి కోసం ఏపనులు చేపట్టాలి అనే విషయం పై గ్రామ వార్డు సభ్యుల తో మాట్లాడి పనులు నిర్ణయించాలని కోరారు. గోనెగండ్ల గ్రామంలో నాలుగురోజులకు ఒక్క సారి కొళాయిలకు నీరు వస్తుందని, దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, నీరు రోజు మార్చి రోజు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

హల్విలో రక్తదాన తులాభార శిబిరం

కౌతాళం, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని హల్విలో ఉన్న మహంతేశ్వర స్వాముల వారి మఠంలో సోమవారం మెగా రక్తదాన తులాభార శిబిరం కొనసాగినది. మఠం పీఠాధిపతి మహంతేశ్వర స్వాములవారి జాతర సందర్భంగా ఈశిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు మఠం నిర్వాహకులు, స్వామివారి భక్తులు తెలిపారు. ఈ శిబిరానికి భారీ ఎత్తున స్పందన వచ్చిందని యువకులు పెద్దఎత్తున రక్తదాన చేశారని తెలిపారు. మహిళలు కూడా రక్తదానం చేసేందుకు ముందుకొచ్చారు. సాయంత్రం 5గంటల వరకు దాదాపు 500మందికి పైగా రక్తదానం చేశారు. మహంతేశ్వర స్వాముల వారు కూడా రక్తదానం చేసి అందరికి ఆదర్శంగా నిలిచారు. రకతదానం చేసిన వారికి మహంతేశ్వర స్వాములు ప్రశంసాపత్రాలను, జూస్‌ను అందజేశారు. దాతలు చేసిన రక్తంతో స్వాముల వారికి రక్త తులాభారం నిర్వహిస్తున్నట్లు భక్తులు తెలిపారు.



దాతకు ప్రశంసా పత్రం అందజేస్తున్న మఠం నిర్వాహకులు

కేజీబీవీ ఎస్‌వోను తొలగించాలి: పీడీఎస్‌యూ



డీఈవోకు వినతి పత్రం ఇస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

కోసిగి, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): కోసిగి కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న ఎస్‌వోను తక్షణమే సస్పెండ్ చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు కే.భాస్కర్, జిల్లా ప్రధాన కార్యదర్శి మహేంద్రబాబు డిమాండ్ చేశారు. 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో ప్రచురితమైన 'నీళ్లచారే' కథనానికి కలెక్టరేట్‌లోని జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ పాల్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోసిగి కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో మెనూ పాటించకుండా తాను పెట్టిందే తినాలంటూ విద్యార్థినులను భయభ్రాంతులకు గురి చేస్తున్న ఎస్‌వోపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు రమణ, నగర అధ్యక్షులు దామోదర్, ఇమామ్‌బాషా పాల్గొన్నారు.

పగుళ్లిచ్చిన హైవే

● మరమ్మతులకు నోచుకోని వైనం
● ఇబ్బందుల్లో వాహనచోదకులు

ఎమ్మిగనూరు, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): ఆదోని - మంత్రాలయం 167 హైవే రోడ్డు ఎమ్మిగనూరు పట్టణ సమీపంలో పగుళ్లిచ్చింది. దీంతో వాహనచోదకులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బంది పడుతున్నారు. ఆదోని - మంత్రాలయం జాతీయ రహదారి ఎమ్మిగనూరు మీదుగా కర్ణాటకలోని రాయచూరు, తెలంగాణలోని జడ్చర్లవరకు ఏర్పాటు చేశారు. ఎమ్మిగనూరు పట్టణం నుంచి మంత్రాలయం వైపు వెళ్లే రహదారి ముగతి గ్రామ సమీపంలో పగుళ్లిచ్చి నోరు తెరచింది. అలాగే ముగతి ఎమ్మిగనూరు మధ్య అక్కడక్కడ రోడ్డు మధ్యలో నెర్రలు ఇవ్వటమే కాక చిన్నపాటిగా తారు లేచిపోయి గుంతలు ఏర్పడ్డాయి. మరీ ముఖ్యంగా పట్టణ శివారులోను, జిన్నింగ్ ఫ్యాక్టరీల దగ్గర రెండు మూడు చోట్ల రహదారి మధ్యలో మలుపులు ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా ఏర్పాటు చేసిన సూచిక దిమ్మెలను వాహనాలు ఢీకొని పక్కకు దొర్లాయి. ఇవి ఇలాగే వదిలేస్తే ఇతర వాహనాలు ఢీకొని ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం ఉంది. అలాగే రోడ్డుకు ఇరువైపులా ఏర్పాటు చేసిన డ్రైన్‌లు సైతం అక్కడక్కడ ధ్వంసమైయ్యాయి. ఓ ఇటుకల బట్టి సమీపంలో డ్రైన్ పగిలిపోయి కనిపిస్తోంది. వర్షాలు వచ్చినప్పుడు నీరు ముందుకు వెళ్లక రోడ్డుపైకి వచ్చే అవకాశం ఉంది. అలాగే కొన్ని చోట్లు హైవే అధికారుల అనుమతులు లేకుండా తమ స్థలాలకు వెళ్లేందుకు డ్రైన్‌లను పగలగొట్టి దారులు ఏర్పాటు చేసుకుంటున్నారు. వాటిని తిరిగి యథాస్థితిలో మరమ్మతులు చేయకపోవటంతో డ్రైన్‌లలో నీరు అలాగే నిలిచిపోతున్నాయి. భారీ వర్షాలు వచ్చినప్పుడు పొంగే అవకాశం ఉంది. జాతీయా రహదారిపై నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. తగ్గులు మిట్టలు లేకుండా చూడాల్సిన బాధ్యత నిర్వాహకులది. అయితే అక్కడక్కడ రహదారి పగుళ్ల ఇవ్వడం, నెర్రలు ఏర్పడి తారులేచిపోయి గుంతలు పడ్డాయి. సంబంధిత అధికారులు స్పందించి జాతీయరహదారికి మరమ్మతులు చేయాలని వాహనచోదకులు కోరుతున్నారు.



ముగతి గ్రామ సమీపంలో పగుళ్లిచ్చిన హైవే

యువతి వివాహానికి చేయూత

ఎమ్మిగనూరు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన పేద ముస్లిం యువతి వివాహానికి అవసరమైన పెళ్లి వస్తువులను ఎస్‌డీపీఐ నాయకులు విరాళంగా అందజేశారు. సోమవారం స్థానిక 9వ వార్డులోని ఎస్‌డీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నాయకులు మక్బుల్, లడ్డు షేక్ పెళ్లి కుమార్తె తల్లికి పెళ్లి వస్తువులను అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌డీపీఐ నాయకులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి: సీఐ

ఎమ్మిగనూరు, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): అగ్నిప్రమాదాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పట్టణ సీఐ శ్రీనివాసులు అన్నారు. ఈనెల 14నుంచి 20 వరకు అగ్నిమాపక వారోత్సవాలను నిర్వహిస్తున్నారు. కార్యక్రమానికి పట్టణ సీఐ శ్రీనివాసులు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కేంద్రంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం అగ్నిమాపక కేంద్రం ఎస్ఎఫ్‌ఓ రామాంజనేయులు ఆధ్వర్యంలో అగ్నిప్రమాదాల్లో వీరమరణం పొందిన జవాన్లకు నివాళి అర్పించారు. వారోత్సవాల పోస్టర్లను సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ డాక్టర్ నాయక్‌లు విడుదల చేశారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.